


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 272, పేజీలు - 08

శుక్రవారం, మార్చి 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## - రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి

- ఈ నెల 22న రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటన
- రూ.2 లక్షల వరకు రుణమాఫీతో రైతులకు ఊరట కల్పించామన్న సీఎం
- ధరణి సమస్యల పరిష్కారానికి భూ భారతిని తీసుకొచ్చామని వెల్లడి

హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సాదా బైనామా భూముల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఉగాది పండుగ శుభదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రకటన చేశారు. అలాగే, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ వేడుక సందర్భంగా ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా భగవంతుడిని ప్రార్థించినట్టుగా తెలిపారు.

2లో..

## వెంటనే సైనిక ఉద్రిక్తతలను

# తగ్గించాలి

- పశ్చిమాసియా యుద్ధంపై వివిధ ప్రభుత్వాధినేతలతో మోదీ సంభాషణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియా యుద్ధంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానులతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం టెలిఫోన్‌లో సంభాషించారు. వెంటనే ఈ సైనిక ఉద్రిక్తతలను తగ్గించి, చర్చలు, దౌత్యాన్ని తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉందని ఈసందర్భంగా అందరు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సంభాషణల వివరాలతో ప్రధాని మోదీ వేర్వేరు ట్వీట్లు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, సుస్థిరతల సాధన కోసం ఇకపైనా పరస్పర సమన్వయంతో పనిచేయాలని తామిద్దరం నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. గురువారం ఉదయం ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్ అల్ సయీద్‌తో ప్రధాని మోదీ సంభాషించారు. ఒమన్ సుల్తాన్‌కు, ఆ దేశ ప్రజలకు రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలను మోదీ తెలిపారు. తమ సంభాషణ ఫలవంతంగా జరిగిందంటూ భారత ప్రధాని ట్వీట్ చేశారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలనే అభిప్రాయానికి తాము వచ్చామన్నారు. సైనిక ఉద్రిక్తతలు తగ్గితేనే శాంతి, సుస్థిరతల పునరుద్ధరణ సాధ్యమవుతుందని మోదీ తెలిపారు. ఒమన్‌పై జరిగిన దాడులను భారత ప్రధాని ఖండించారు. వేలాదిమంది

2లో..

# నా పోరాటం ముగ్గురిపైనే

- జాగృతి కార్యాలయంలో కవిత ఉగాది వేడుకలు
- డాడీ, మోడీ, చిన్న మోడీ (కేటీఆర్)ల పైనే తన పోరాటం అని వెల్లడి
- మంచి ముహూర్తం చూసుకుని పార్టీ ప్రారంభిస్తానన్న కవిత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపునకు మాజీ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తెరతీశారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె, తన రాజకీయ ప్రయాణంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్నట్లు స్పష్టం చేస్తూ, ప్రస్తుతం పార్టీ అజెండాపై తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. గాంధీజీ ప్రతిపాదించిన సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నానని, సామాజిక సమానత్వమే లక్ష్యంగా తన పార్టీ విధివిధానాలు ఉంటాయని ఆమె

2లో..

## సంస్కృతికి సాంకేతికత

# జోడించి అభివృద్ధి

## - పరాభవ నామ సంవత్సరంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

- ప్రతి ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ
- 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపాలన్నదే లక్ష్యం
- జనాభా పెరుగుదల కోసం ప్రోత్సాహకాలు.. ఇద్దరు, ముగ్గురు పిల్లలుంటే ఆర్థిక సాయం



అమరావతి (ప్రశ్న న్యూస్) పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ శుభాలను, విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ కమ్యూనిటీగా నిలపాలన్నదే తన సంకల్పమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యాలుగా ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుందని

2లో..

# పంచె కట్టులో మెరిసిన జగన్

## - సతీ సమేతంగా ఉగాది వేడుకలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగువారి కొత్త ఏడాది 'ఉగాది' పర్వదినాన్ని పురస్కరించుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ భారతి దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాంప్రదాయబద్ధంగా పంచెకట్టు, భుజాన కండువాతో విచ్చేసిన జగన్ దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఉగాది వేడుకల కోసం పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక పూజా మందిరం వంటి వేదికను ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ప్రముఖ సిద్ధాంతి పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. పరాభవ నామ సంవత్సరంలో గ్రహగతులు, వర్షపాతం మరియు రాష్ట్ర భవిష్యత్తుపై ఆయన అంచనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.
పంచాంగ శ్రవణం ముగిసిన తర్వాత వేద పండితులు జగన్ దంపతులకు వేద ఆశీర్వచనం ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జగన్

2లో..

## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న రణధీర్ జైశ్వాల్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మనదేశానికి చేరుకున్నాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ దాడితో ఖతార్‌కు భారీ నష్టం

## - మరమ్మతులకే 5 ఏళ్లు పడుతుందన్న ఖతార్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇరాన్ దాడుల కారణంగా ఖతార్‌కు భారీ నష్టం సంభవించింది. ఖతార్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన ఉత్పత్తి క్షేత్రాలపై ఇరాన్ దాడులు చేయడం వల్ల, లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ఎగుమతుల్లో 17 శాతం వరకు ఉత్పత్తి చేసే కేంద్రాలు దెబ్బతిన్నాయని ఖతార్ ఎనర్జీ సీఈవో సాద్ అల్కాబీ వెల్లడించారు. ఈ దాడి వల్ల 20 బిలియన్ డాలర్ల మేర నష్టం జరిగిందని, ఈ కేంద్రాల మరమ్మతుకు 5 ఏళ్లు పడుతుందని తెలిపారు. ఖతార్ ఇంధన ఉత్పత్తి మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల కారణంగా రాస్ లఫాన్ కేంద్రంలోని రెండు ఎల్ఎన్‌జీ ఉత్పత్తి కేంద్రాలు, ఒక గ్యాస్ టు లిక్విడ్స్ కేంద్రం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఈ దాడి వల్ల 12.8 మిలియన్ టన్నుల చమురు ఉత్పత్తి నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరప్, ఆసియాకు ఎల్ఎన్‌జీ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఖతార్‌లో ఇలాంటి దాడులు జరుగుతాయని అసలు ఊహించలేదని, ఖతార్ ఎనర్జీ సీఈవో అన్నారు. రంజాన్ మాసంలో తమ సోదర దేశం ఇలా చేస్తుందని అనుకోలేదని వాపోయారు. ఎల్ఎన్‌జీలకు సంబంధించి ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం పడుతుందని అన్నారు. దెబ్బతిన్న కేంద్రాల నిర్మాణానికి 26 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని వెల్లడించారు. ఐదేళ్ల పాటు 17 శాతం ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతిన్నట్లే అన్నారు.

# వైభవంగా 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుక

## - హాజరైన ప్రముఖులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉగాది పండగని పురస్కరించుకుని 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మార్చి 19 సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ వేడుక జరిగింది. సుమ కనకాల, ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజు ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఎఫ్డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో సినిమా, థియేటర్, టెలివిజన్ రంగాల్లో విశిష్ట ప్రతిభను గుర్తించి సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025లో విడుదలై సత్తా చాటిన సినిమాలకుగానూ వివిధ విభాగాల్లో అవార్డులు అందజేశారు. ప్రశంసా పత్రంతోపాటు, నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు పురస్కారాలు ఇచ్చారు. జ్యూరీ కమిటీకి గోల్డెన్ మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అందజేశారు. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి-సురేఖ దంపతులు, కింగ్ అక్కినేని నాగార్జున-అమల దంపతులు, యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, నాగ చైతన్య-శోభిత ధూళిపాళ దంపతులు, అల్లు అరవింద్, సురేష్

2లో..

## వందేమాతరం పాడాల్సిందే..

# లేదంటే లోపలేస్తాం

## - కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అసెంబ్లీలో వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్ళిపోవటాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా వందేమాతరం పాడాల్సిందేనని అన్నారు. తాము అధికారంలోకి వస్తే దీనిని తప్పనిసరి చేస్తామని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన అసెంబ్లీలో ఎంఐఎం ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరుపై నిప్పులు చెరిగారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' అనే వ్యాఖ్యలపైనా స్పందించారు. కాంగ్రెస్ పార్టీలోని ఓ సీనియర్ నాయకుడిని ఉద్దేశించి రేవంత్ ఈ కామెంట్స్ చేశారన్నారు. కాంగ్రెస్‌లోని ఒక కీలక నేత రహస్యంగా మరో పార్టీతో సమావేశమైన నేపథ్యంలోనే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అలాగే, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలుతున్నాయని ఆరోపించారు. ఆ బాధ్యతలను రాహుల్ రేవంత్ రెడ్డికి అప్పగించారన్నారు.రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వానిది ద్వంద్వ నీతి అని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతు కూలీలకు, కౌలు రైతులకు సాయం ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసా సహా, పెండింగ్‌లో ఉన్న 5 వాయిదాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసినట్లు ఇక్కడ కూడా చేయాలని, అయితే బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చివేస్తే బీజేపీ

2లో..

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఈ నెల 22న రైతు భరోసా అందించబోతున్నామని తెలియజేస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ధరణి రూపంలో భూతమై రైతులను బాధ పెడుతున్న సందర్భంగా రైతులకు అండగా దాన్ని తరిమేసి భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని చెప్పారు.సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కించడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల మేరకు దేశంలో అతితక్కువ రుణభారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగాలు ఎంతగా రాణించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయమేనని అన్నారు. రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం బాగుంటుందని చెప్పారు. రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,616 కోట్ల 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను ఆత్మగౌరవంతో బతకడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని... ఇప్పటికే ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద అందించిందని చెప్పారు. పండించిన పంటలపై రైతుల్లో విశ్వాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ చేయడం, రైతుభరోసా అందించడంతో పాటు రైతు బీమా అమలు చేయడం వంటివన్నీ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు అని వివరించారు. ప్రభుత్వం రైతుల కోసం ప్రయత్నాలు, నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ దేశంలో తెలంగాణ ప్రతిష్టను పెంపొదిస్తాయని చెప్పారు.

# వెంటనే సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలి

భారతీయులు సురక్షితంగా భారత్‌కు తిరిగి చేరడానికి సౌకర్యాలు కల్పించినందుకు ఒమన్ సర్కారును ప్రశంసించారు. కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా ఉన్న సముద్ర రవాణా మార్గాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని భారత్, ఒమన్ నిర్ణయించాయన్నారు. హర్మూజ్ మీదుగా సురక్షిత, స్వేచ్ఛాయుత రవాణా జరిగ్గ పరిస్థితులు ఏర్పడాలని ఇరుదేశాలు కోరుకుంటున్నాయని మోదీ పేర్కొన్నారు.మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంకు భారత ప్రధాని మోదీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై వారిద్దరు చర్చించారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించేందుకు అందుబాటులో ఉన్న మార్గాలపైనా వారు సంభాషించుకున్నారు. అంతకుముందు రోజు కువైట్ యువరాజు షేక్ సబా అల్ ఖాలెద్ అల్ హమద్ అల్ ముబారక్ అల్ సబాతోనూ ప్రధాని మోదీ టెలిఫోన్‌లో సంభాషించారు. ఈవివరాలను గురువారం మీడియా సమావేశం వేదికగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఆయన చేసిన ప్రకటన ప్రకారం, కువైట్‌పై ఇప్పటివరకు జరిగిన దాడులను భారత ప్రధాని మోదీ ఖండించారు. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకలు, ఆయిల్ ట్యాంకర్ల సురక్షిత రాకపోకలకే భారత్ అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని కువైట్ యువరాజుతో మోదీ అన్నారు. కువైట్‌లోని భారతీయుల భద్రతకు మద్దతును అందిస్తున్నందుకు యువరాజుకు భారత ప్రధాని ధన్యవాదాలు చెప్పారు. దీంతోపాటు రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలను మోదీ తెలిపారు.

# పంచె కట్టులో మెరిసిన జగన్

సిద్ధాంతి పిడపర్తి భాస్కర సుబ్రమణ్యశాస్త్రితో పాటు వేద పండితులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమం అనంతరం జగన్ మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ, పార్టీ శ్రేణులకు, అభిమానులకు హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరాభవ నామ సంవత్సరం అందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ ఉగాది శుభాకాంక్షలు పంచుకున్నారు.

# సంస్కృతికి సాంకేతికత జోడించి అభివృద్ధి

ఆయన భరోసా ఇచ్చారు.

### సంస్కృతి, సాంప్రదాయాలకు సైన్స్ జోడింపు

ఉగాది పండుగ తెలుగువారి తొలి పండుగ అని, మన సంస్కృతి, సాంప్రదాయాల్లో సైన్స్ ఇమిడి ఉందని చంద్రబాబు వివరించారు. ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన ఆచారాలైన వాస్తు, యోగా, ధ్యానం వెనుక శాస్త్రీయత దాగి ఉందని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇవి దోహదపడతాయని అన్నారు. గతంలో తాను ఐటీ ప్రాముఖ్యతను గుర్తించి ప్రోత్సహించడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. తాను కూడా సెల్ ఫోన్ ద్వారానే పాలన సాగిస్తూ, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటున్నానని తెలిపారు.

### సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

2024కు ముందు రాష్ట్రంలో పండుగలు కూడా జరుపుకోలేని భయానక వాతావరణం ఉండేదని, అరాచకాలు, విధ్వంసంతో ప్రజలు విసిగిపోయారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతో జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలలుగా సమ్మిళిత సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మందిని పైకి తీసుకురావడానికి, ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది చేయూతనివ్వాలని కోరుతూ 'మార్గదర్శి బంగారు కుటుంబం' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

### ఉగాది కానుకగా ఉద్యోగాల జాతర

యువత భవిష్యత్తుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉగాది పండుగ సందర్భంగా చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి ఏటా ఉగాది రోజున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 10,060 ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేశారు. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2, హోంశాఖ, ఉన్నత విద్య, ఇంజనీరింగ్ వంటి పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మే 15 నుంచి అక్టోబర్ 15 మధ్య ఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టులతో సహా మొత్తం 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటు రంగంలో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించామని గుర్తుచేశారు.

### పోలవరం, అమరావతిపై స్పష్టమైన హామీ

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, అందులో భాగంగానే పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. దీనికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని, త్వరలోనే మిగిలిన నిధులను కూడా సమకూర్చుకుని పనులు వేగవంతం చేస్తామన్నారు. అమరావతి దేవతల రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ప్రజల రాజధాని అని పేర్కొన్నారు. అమరావతిని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి, సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని వెంకటేశ్వర స్వామిని ప్రతిరోజూ ప్రార్థిస్తానని తెలిపారు.

### కుటుంబ వ్యవస్థ పరిరక్షణకు కొత్త విధానాలు

మారుతున్న కాలంతో పాటు కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులపై చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తుతాయని, అందుకే జనాభా నిర్వహణపై కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలిపారు. "ఒకరు వద్దు, ఇద్దరు ముద్దు, ముగ్గురుంటే ఇంకా మంచిది" అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఆర్థిక సహాయం అందించి కుటుంబాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. పెద్ద కుటుంబాలు సుఖసంతోషాలకు నిలయాలని, విడిపోవడం కంటే కలిసి ఉండటానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.

### 2047 నాటికి తెలుగుజాతి నంబర్ వన్

ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మనపై ప్రభావం చూపుతాయని, ఇలాంటి సమయంలో మనం తప్పులు చేయకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని చంద్రబాబు హితవు పలికారు. పరాభవ నామ సంవత్సరం తెలుగుజాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పే సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు.

2047 నాటికి భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి తెలుగువారు ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలవాలనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. సంపదతో పాటు విలువలను కాపాడుకుంటూ, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేస్తూ, అందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలిపి తన ప్రసంగాన్ని ముగించారు.

# నా పోరాటం ముగ్గురిపైనే

పేర్కొన్నారు. తన పోరాటం ఎవరి మీదో స్పష్టం చేశారు. డాడీ , మోడీ , చిన్న మోడీ లపై తన యుద్ధం ఉంటుందని కవిత వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కేసీఆర్ పై కూడా రాజకీయ పోరాటం చేస్తానని ప్రకటించడం సంచలనంగా మారనుంది. బడా భాయ్ అనిమోదీని పిలిచే రేవంత్‌ను..కవిత చిన్నమోడీ అని ప్రస్తావించారు. ఒక మంచి ముహూర్తం చూసుకుని కొత్త పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తానని కవిత చెప్పారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత సమస్యలను కాంగ్రెస్ పార్టీ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని కవిత ఆరోపించారు. తనకూ, తన కుటుంబానికీ మధ్య జరుగుతున్న ఇష్యూను అడ్వాంటేజ్‌గా తీసుకుని లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. తనపై జరుగుతున్న ఈ కుట్రలను ప్రజల ముందు ఉంచుతానని, స్వతంత్రంగా ప్రజల గొంతుకగా నిలబడతానని స్పష్టం చేశారు. అంతకు ముందు కవిత ఎన్నికల సంఘం వద్ద దాఖలు చేసిన తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ నమోదు ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు , కేంద్ర ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. కల్వకుంట్ల కవిత సమర్పించిన దరఖాస్తుపై వీలైనంత త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా, కవిత దరఖాస్తులో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని కోరుతూ ఇప్పటికే ఆమెకు సమాచారం అందించినట్లు ఈసీ కోర్టుకు తెలిపింది. ఈ లోపాలను సరిదిద్దిన తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించడంతో, కొత్త పార్టీ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు త్వరలోనే తొలగిపోయే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రజా జాగృతి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కానుందని సమాచారం. గతంలో తాను స్థాపించిన తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా ఉన్న నెట్‌వర్క్‌ను ఇప్పుడు రాజకీయ శక్తిగా మార్చుకోవాలని ఆమె భావిస్తున్నారు. ఈ పరిణామం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు కొత్త సవాలుగా మారుతుందా లేదా అనేది వేచి చూడాలి.

# వైభవంగా 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుక

బాబు, మురళీ మోహన్, జయసుధ, నాగ సుశీల, టీజీ విశ్వప్రసాద్, వి. సముద్ర, తమ్మారెడ్డి భరద్వాజ, రోషన్ మేక, అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, రష్మిక, సాక్షి వైద్య, రితికా నాయక్, ప్రగతి, బీవీఎస్ఎన్ ప్రసాద్, కె.రాధాకృష్ణ, వంశీ నందిపాటి తదితరులు హాజరయ్యారు. 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్'లో ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ నటుడిగా నాగ చైతన్య (తండేల్), ఉత్తమ నటిగా రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్) అవార్డు అందుకున్నారు. ఉత్తమ కొరియోగ్రాఫర్ గా ఆట సందీప్-జ్యోతి దంపతులు (గిర గిర గిర - ఛాంపియన్), ఉత్తమ ఆడియోగ్రాఫర్ గా ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కిందపురి), ఉత్తమ ఆర్ట్ డైరక్టర్ గా తోట తరణి (ఛాంపియన్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ గా చంద్రకాంత్ (ఛాంపియన్), ఉత్తమ సినిమాటోగ్రాఫర్ గా కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్) అవార్డులు స్వీకరించారు. జ్యూరీ క్యాటగిరీలో బెస్ట్ ఫిల్మ్ గా '23', చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి), అనంతిక (8 వసంతాలు) రోషన్ (ఛాంపియన్) పురస్కారాలు అందుకున్నారు. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ఈవెంట్ లో హీరోయిన్ నిధి అగర్వాల్ తన ప్రత్యేక ప్రదర్శనతో ఆకట్టుకుంది. దివంతత సావిత్రి, శ్రీదేవి, సౌందర్య నటీమణులకు నివాళిగా రూపొందించిన పాటలకు నిధి డ్యాన్స్ చేసింది. అలానే 'నాగబంధం' సినిమాలోని పాటకు నభా నటేష్ లైవ్ పర్ఫార్మన్స్ తో అలరించింది. సింగర్ మంగ్లీ కూడా తన పాటలతో సందడి చేశారు.

## వందేమాతరం పాడాల్సిందే..లేదంటే లోపలేస్తాం

చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించిన తర్వాతే ముందడుగు వేయాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయిందని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం నేతల ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యా సంస్థల్లోనే ఉగ్రవాద మూలాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి కష్టాలు తొలిగిపోయి సుఖశాంతులతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు.

# నేటి నుంచి భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు




భద్రాచలం : ఉగాది పర్వదినం సందర్భంగా నేటి నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా ఉగాది రోజున ఉత్సవాలకు అంకురార్పణ జరపడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. పరాభవ నామ సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలతో ఆలయ అర్చకులు, వేద పండితులు వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 27న మిథిలా మండపంలో సీతారామ కళ్యాణోత్సవం జరపనున్నారు.ఏప్రిల్ 2 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నవమి రోజున రెండు లక్షల తలంబ్రాల ప్యాకెట్లు, లక్ష లడ్డూలు సిద్ధం చేసినట్లు వివరించారు.

# రియల్‌మి నుంచి పీ4 లైట్ 5జీ ఫోన్ రిలీజ్.. ధర బడ్జెట్‌లోనే.. ఫీచర్స్, ధర వివరాలివి

చైనాకు చెందిన రియల్‌మి సంస్థ బడ్జెట్ రేంజ్, మీడియం రేంజ్ ఫోన్లు కొనే వినియోగదారులే లక్ష్యంగా ఫోన్లు విడుదల చేస్తుంటుంది. తాజాగా మరో 5జీ బడ్జెట్ ఫోన్‌ను మార్కెట్లో లాంఛ్ చేసింది. రియల్‌మి పీ4 లైట్ 5జీ పేరుతో కొత్త ఫోన్‌ను గురువారం విడుదల చేసింది. 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ దీని ప్రత్యేకత. అలాగే, ఇప్పటికే పీ4 సిరీస్‌లో భాగంగా పీ4, పీ4 ఎక్స్, పీ4 ప్రో5జీ ఫోన్లు రాగా.. ఇదే సిరీస్‌లో ఇప్పుడు తక్కువ ధరలో పీ4 లైట్‌ను తీసుకొచ్చింది. ఇది మొజాయిక్ బ్లూ, మొజాయిక్ గ్రీన్ కలర్స్‌లో లభిస్తుంది. ఈ నెల 25 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో, రియల్‌మి సైట్‌లో సేల్‌కు అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్‌లోని ప్రధాన ఫీచర్లివి. 6.8 అంగుళాల హెచ్‌డీఎల్‌సీడీ డిస్‌ప్లే, 144హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 900 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 180హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేట్, ఐపీ64 రేటింగ్ తో డస్ట్, స్ప్లాష్ రెసిస్టెంట్, ఆండ్రాయిడ్ 16 ఓఎస్ రియల్‌మి యూఐ 7.0, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 5జీ చిప్, 4జీబీం64జీబీ, 4జీబీం128జీబీ, 6జీబీం128జీబీ, యూఎఫ్ఎస్ 2.2 స్టోరేజీ సపోర్టు, ఎయిర్‌ఫ్లో వేపర్ ఛాంబర్, 7000ఎంఏహెచ్ బ్యాటరీ, 15 వాట్స్ వైర్ ఛార్జింగ్ సపోర్టు, 13 ఎంపీ ప్రైమరీ కెమెరా, 5 ఎంపీ సెల్ఫీ కెమెరా, 212 గ్రాముల బరువు వంటి ఫీచర్లున్నాయి. రెండేళ్లపాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, 3 సంవత్సరాల వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తారు. ధరలు వేరియెంట్‌ను బట్టి రూ.12,999 / రూ.13,999 /రూ.15,999.

# ప్రతి రోజు మిషన్ భగీరథ నీరు.. గ్రామంలోని ప్రతీ ఇంటికి వాటర్ క్యాన్



బచ్చన్నపేట, మార్చి 19 : గ్రామంలోని ప్రతీ ఇంటికి కొత్త వాటర్ క్యాన్లు అందించడం జరిగిందని పడమటి కేశవాపూర్ సర్పంచ్ ఎర్రోళ్ల విజయ సోములు అన్నారు. గురువారం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం పురస్కరించుకొని క్యాన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేసిన అనంతరం, అక్కడికి రాని వారి ఇంటింటికి వెళ్లి వాటర్ క్యాన్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ప్రతిరోజు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని, ఇందుకుగాను ఆయా వార్డులో ప్రత్యేకంగా గేటు వాల్వ్ లు బిగించామని వెల్లడించారు. దానితోపాటు అవసరం ఉన్నవారు ఫిల్టర్ వాటర్ తెచ్చుకునేందుకు ఈ క్యాన్లు అందజేశామని వెల్లడించారు. గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆమె స్పష్టం చేశారు. ప్రజల మౌలిక అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రొల్ల విజయ సోములు ఉప సర్పంచ్ తాడెం నరేందర్, ఈమైనా భాగ్య, తరిగొప్పుల బాలమణి,యాసరేని వెంకటేష్, గిద్దల రాజు బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు వేముల మహాదేవ్, జంగిటి ప్రభాకర్ తాడేం నర్సింలు, తరిగొప్పుల నర్సింలు,,వనం బాలకిషన్, గడిల భాస్కర్ రెడ్డి, శేరి యాదగిరి,,గంగరమైన సుధాకర్, గజ్వేల్ రమేష్, గిద్దల బాలకిషన్, గద్దరాజు రాజు గిద్దల భాస్కర్, యూత్ అధ్యక్షులు వేముల, హరి కృష్ణ ఆరేపల్లి కర్ణాకర్, పెద్దారం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.అనంతరం గ్రామానికి చెందిన యాదగిరి కూల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయగా గ్రామ సర్పంచ్ విజయ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం నరేందర్, షేరి యాదగిరి పాల్గొన్నారు.

# ఒకేచోట కుప్పగా కొండచిలువల గుంపు.. భయాందోళనకు గురైన జనం



ఒకేచోట కుప్పగా ఉన్న కొండచిలువల గుంపు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఏకంగా ఐదారు భారీ కొండచిలువల గుంపు కదలకుండా పడుకుని కనిపించడం కలకలం రేపింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కాంగ్రా జిల్లా లోని గల్లియాన్ ప్రాంతంలోగల ప్రసిద్ధ కాళేశారే వాలీ మాత ఆలయం వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. మొదట ఆ పాములను చూసి నేల మీద పరుచుకున్న చెట్టు వేర్లుగా భావించారు. అవి కొండచిలువలు అని ఎవరూ అనుమానించలేదు.అయితే కొందరు అనుమానంతో ఆ గుంపుపైకి రాయి విసరడంతో అసలు విషయం బయటపడింది. ఆ కొండచిలువల గుంపు ఒక్కసారిగా కదిలింది. దాంతో అక్కడున్న వారంతా షాకయ్యారు. అవి భారీ కొండచిలువలు అని గ్రహించి భయంతో పరుగులు తీశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. సుమారు 5 నుంచి 6 భారీ కొండచిలువలు ఆ గుంపులో ఉన్నాయి. జనం గమనించిన కొద్దిసేపటికే అవి వేగంగా చెల్లాచెదురై సమీపంలోని పొదల్లోకి జారుకున్నాయి.ఈ భయానక దృశ్యాన్ని అక్కడున్న వారు తమ మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో క్షణాల్లో వైరల్‌గా మారింది. ఇంత పెద్ద సంఖ్యలో కొండచిలువలు ఒకేచోట గుంపుగా కనిపించడం చాలా అరుదని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు. ఈ ఘటనతో ఆలయానికి సమీపంలో, అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివసించే ప్రజల్ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.ఘటనా ప్రాంతానికి చేరుకున్న అధికారులు కొండచిలులువలు మనుషుల జోలికి రావని, తమంతట తాముగా దాడి చేయవని చెప్పారు. అయితే వాటిని రెచ్చగొట్టినా, ఇబ్బంది పెట్టినా లేదా వాటికి అపాయం ఉందని భావించినా అవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# విజయ్ పార్టీ క్యాడర్, మహిళా నేతలను కలవడం లేదు

**- రంజనా నచియార్**




తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలకు జాతీయ పార్టీలతోపాటు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నిరెడీ అవుతున్న విషయం తెలిసిందే. తమిళనాట నటుడు, టీవీకే చీఫ్ విజయ్ అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాడు. ఇదిలా ఉంటే మాజీ టీవీకే నేత రంజనా నచియార్ కామెంట్స్ సినీ, రాజకీయ వర్గాల్లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాయి. విజయ్ స్థాపించిన పార్టీ టీవీకే. తాను పార్టీలో మార్పులు తీసుకురాబోతున్నానని విజయ్ చెప్పారని.. అయితే విజయ్ తన మాటల మీద నిలబడటం లేదన్నారు.వీశీజఱవం టీవీకే చీఫ్ విజయ్ ముందుకొచ్చి ప్రజలను కలవాలి. పార్టీలో జరుగుతున్న చాలా అంశాలను అనుమానించాల్సి వస్తోంది. మహిళా దినోత్సవం రోజు టీవీకే నేత మహిళలను స్టేజ్‌పై అగౌరవపరిచారు. విజయ్ క్షేత్ర స్థాయిలో పార్టీ క్యాడర్, మహిళానేతలు, ప్రజలను కూడా కలవడం లేదు. డీఎంకే ఇప్పటికే అధికారంలో ఉన్న పార్టీ, డీఎంకేపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. నటి, మాజీ టీవీకే నేత అయిన రంజనా నచియార్ సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకేలో చేరారు.

# మంత్రివర్గ మార్పులపై ఊహాగానాలు

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో భారీ మార్పులు చేపట్టబోతున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు సీఎం సిద్ధమవుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయిముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో ఎప్పుడూ క్రమశిక్షణకు, పనితీరుకు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరుపై ఆయన సంతృప్తిగా లేరని, అందుకే సుమారు 10 మంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారిని పదవుల నుండి తొలగించడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.ప్రధానంగా మంత్రుల పనితీరును అంచనా వేయడానికి కొన్ని కీలక ప్రమాణాలను ఆయన ప్రాతిపదికగా తీసుకుంటున్నట్టు సమాచారం. ముఖ్యంగా మంత్రులు తమకు కేటాయించిన శాఖలపై ఎంతవరకు అవగాహన కలిగి ఉన్నారు? ఎంతమేరకు పట్టు సాధించారని బేరీజు వేస్తున్నారు. పాలనలో అధికారులతో కలిసి ఎలా పని చేస్తున్నారు? ఎన్ని సమీక్షా సమావేశాలు నిర్వహించారు? కేంద్ర ప్రభుత్వం నుండి తమ శాఖలకు రావాల్సిన నిధులను రాబట్టడంలో ఎంతవరకు సఫలీకృతులయ్యారు? ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ఏ మేరకు కృషి చేశారు? ఎన్ని ప్రెస్ మీట్స్ నిర్వహించి ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టారు? .. లాంటి అంశాలపై చంద్రబాబు నివేదికలు రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది.ప్రతి మంత్రికీ ఒక ప్రోగ్రెస్ కార్డ్ సిద్ధమవుతోంది. ఈ నివేదికలు కేవలం పైపైన పరిశీలనతో కాకుండా, ప్రతి నిమిషం వారి పనితీరును పర్యవేక్షించి తయారు చేస్తున్నారు. ఈ రిపోర్టుల ఆధారంగానే ఎవరిని కొనసాగించాలి, ఎవరికి ఉద్వాసన పలకాలి అనే విషయంలో సీఎం ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ పరిణామం ప్రస్తుతం ఉన్న చాలా మంది మంత్రులకు నిద్ర లేకుండా చేస్తోంది.ఈసారి జరగబోయే మార్పుల్లో లోకేశ్ టీంకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, లోకేష్‌కు అండగా ఉండేలా ఉత్సాహవంతులైన నాయకులకు, యువకులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే వారికే ఈసారి పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం.ఈ మంత్రివర్గ మార్పులు కేవలం పరిపాలన కోసమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉంటాయని తెలుస్తోంది.

ఎన్నికలకు వెళ్లే ముందు బలమైన టీమ్‌ను సిద్ధం చేసుకోవడం చంద్రబాబు వ్యూహం. ఉగాది పండుగ నాటికి లేదా మరో రెండు మూడు నెలల్లో ఈ మార్పులు ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా కేబినెట్ మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు.మొత్తానికి ఏపీ క్యాబినెట్‌లో రాబోయే మార్పులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, అది ప్రభుత్వ పనితీరులో వేగాన్ని పెంచే ప్రయత్నం. 10 మంది మంత్రుల శాఖల మార్పు, కొత్త రక్తానికి అవకాశం ఇవ్వడం ద్వారా పాలనలో కొత్త ఉత్తేజాన్ని తీసుకురావాలని చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రోగ్రెస్ కార్డ్ రాజకీయాల్లో ఎవరి **భవిష్యత్తును నిర్ణయిస్తుందో వేచి చూడాలి.**

**కూటమి పార్టీలు..** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నారా లోకేశ్ ఒకరకంగా భావి నేతగా అవతరిస్తున్నారు. నారా లోకేశ్ విభిన్నశైలిని చూసిన వారికి ఎవరికైనా త్వరలోనే ఆయన కీలక పదవి అధిష్టించే అవకాశముందని అంచనా వేస్తారు. ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను ఎత్తి చూపేవారిని శత్రువులుగా చూస్తారు. వైసీపీ హాయంలో సమస్యలు చెప్పిన వాళ్లపై టీడీపీ ముద్ర వేసి వేధించారు. కానీ ఇక్కడ నారా లోకేశ్ మార్పు చూపిస్తున్నారు. సమస్యలను ప్రస్తావించడాన్ని ఓ సానుకూల విషయంగా చూసి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోణంలో మన్యంలో సమస్యలపై జాతీయ మీడియా కథనాలు వచ్చినా.. గుంటూరులో డ్రైనేజీ సమస్య గురించి ఓ మహిళ చెప్పినా? ఉద్దేశపూర్వకంగా చేశారని తెలిసినా.. మధ్యాహ్నభోజనం అంశంపై ఓ వీడియోలో విద్యార్థుల ఆగ్రహం గురించి తెలిసినా..ఆయన చాలా పాజిటివ్ గా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం అప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు.సాధారణంగా అధికారంలో ఉన్నవారు తమ వైఫల్యాలను ఎత్తిచూపే వారిని రాజకీయ శత్రువులుగా చూస్తుంటారు. కానీ, ఇప్పుడు నారా లోకేశ్ దానికి విభిన్నంగా వ్యవహరిస్తున్నారు.. తన వద్దకు వచ్చే విమర్శలను, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఆయన ఒక ఫీడ్‌బ్యాక్ గా స్వీకరిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉన్నా, అది ఎవరు చెప్పినా.. దాని వెనుక రాజకీయం ఉందా లేదా అని చూడకుండా పరిష్కారం వైపే అడుగులు వేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా దేవునిచెరువు పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగ్గా లేదని విద్యార్థులు ఆహారాన్ని చెత్తబుట్టలో పోస్తున్న వీడియో వైరల్ అయ్యింది.

దీనిపై లోకేష్ స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తారు, కానీ లోకేష్ మాత్రం నిస్సంకోచంగా క్షమాపణలు చెప్పారు. బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందకపోవడం నా బాధ్యతారాహిత్యం అని పేర్కొంటూ వెంటనే సంబంధిత ఏజెన్సీని తొలగించి, హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేయించారు. ఒక మంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా క్షమాపణలు చెప్పడం రాజకీయాల్లో అత్యంత అరుదైన విషయమని కూడా అంటున్నారునారా లోకేశ్ విషయంలో కూటమి పార్టీల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఏమీ లేనట్లే కనిపిస్తుంది. నారా లోకేశ్ పర్యవేక్షణలోనే పరిపాలన నడుస్తుందని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలకు తెలుసు. కానీ వారు మాత్రం దానిని పాజిటివ్ గానే తీసుకుంటున్నారు. ఎటూ జరిగేది అదేనని, అత్యధిక స్థానాలతో అధికారంలో ఉన్న టీడీపీలో నాయకత్వ బాధ్యతను ఎవరికి అప్పగించాలన్నది ఆ పార్టీ నేతల ఇష్టమన్న అభిప్రాయానికి వచ్చేసినట్లు కనిపిస్తుంది. లోకేష్ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథాను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కూడా మనస్ఫూర్తిగా ప్రశంసించారు. విమర్శలను స్వీకరించి, వాటిని పరిష్కరించే విషయంలో నారా లోకేశ్ చూపిస్తున్న పరిణతి రాజకీయాల్లో గొప్ప మార్పుకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద నారా లోకేశ్ అందరి అనుమతితోనే త్వరలోనే కీలక పదవి చేపట్టే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేకపోతున్నారు.

# ఏలూరు ఎంపీ ఇరికించారా... ఇరుక్కున్నారా..

**ఏలూరు** హైదరాబాద్ మెయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్ కేసులో సంచలన వాస్తవాలు బయటికొస్తున్నాయి.. ఒక సాధారణ డిన్నర్ పార్టీ అని వెళ్ళిన ఏలూరు ఎంపీ తెలియకుండానే డ్రగ్ కేసులో ఇరుక్కుపోయారు. దీని వెనుక తీవ్రమైన కుట్ర కోణం ఉందనే వాదన తెరపైకి వచ్చింది. కనీసం సిగరెట్ కూడా తాగే అలవాటు కూడా లేని పుట్టా మహేష్ కుమార్ పై డ్రగ్స్ ఆరోపణలు రావడంతో అయన సన్నిహితులు, పార్టీ నేతలు విస్తుపోయారు. . ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉన్న ఎంపీ మార్గమధ్యంలో ఫార్మ్ హౌస్ లో ఉన్న ఒక స్నేహితుడిని కలిసేందుకు ఆగారు. ఎంపీ ఫామ్ హౌస్ కి వెళ్ళిన కొద్దిసేపటికి ఈగల్ టీమ్ పోలీసులు వచ్చి డ్రగ్స్ చెకింగ్ చేయాలని చెప్పి అక్కడ ఉన్న 11 మంది వద్ద పోలీసుల సమక్షంలోనే యూరిన్ శాంపిల్ తీసుకుని రాపిడ్ టెస్ట్ చేసారు. 10 నిమిషాల తర్వాత చేవెళ్ల డీసీపీ వచ్చి ఐదుగురికి పాజిటివ్ వచ్చిందని, పుట్టా మహేష్ కుమార్ సహా మిగిలినవారికి నెగెటివ్ వచ్చిందని స్పష్టంగా ప్రకటించిన విషయం అన్ని మీడియాలలో రావడం ప్రజలంతా దానిని చూడటం అందరికి తెలిసిన విషయమే. చేవెళ్ల డీసీపీ ఏలూరు ఎంపీ వద్దకు వచ్చి మీకు నెగటివ్ వచ్చింది, మీరు కొద్దిసేపటిలో మిమ్మలిని పంపించేస్తామని కూడా చెప్పినట్లు సమాచారం. అసలైన ట్విస్ట్ ఇక్కడే మొదలయింది. ఇంతలో ఎస్పీ గిరిధర్ రంగప్రవేశం చేసారు. పుట్టా మహేష్ కు యూరిన్ టెస్ట్ లో నెగటివ్ వచ్చిన రిపోర్ట్ ను పోలీసులు ఎస్పీ ముందుంచారు. రిపోర్ట్ ను చూసిన ఎస్పీ అక్కడనుంచే ఎవరితోనో ఫోన్ లో మాట్లాడారు. మాట్లాడుతూ తలసాని శ్రీనివాస్ గారి అల్లుడు ఉన్నాడని ఫోన్ లోనే అవతలి వ్యక్తులకు చెప్పారని తెలుస్తోంది . ఈ మాటలు అక్కడ అందరు వింటూనే ఉన్నట్లు కూడా సమాచారం . ఆ మాటలు వింటూనే ఉన్న ఎంపీ పుట్టా మహేష్.. నేను తలసాని అల్లుడిని కాదని తెలపటానికి ప్రయత్నించినట్టు తెలిసింది. కానీ ఎస్పీ ఆ మాటలు ఏవి పట్టించుకోకుండా ఫోన్ పెట్టేసిన తర్వాత మరొక ఫోన్ కూడా మాట్లాడారు. అనంతరం పోలీసులవేపు తిరిగి, యూరిన్ టెస్ట్ కచ్చితమైన రిజల్ట్ రాదు, బ్లడ్ టెస్ట్ కూడా చేస్తేనే కచ్చితమైన రిజల్ట్ వస్తుందని చెప్పి, నెగటివ్ వచ్చిన వాళ్ళతో సహా వీరందరిని ఇక్కడే ఉంచండి, బ్లడ్ శాంపిల్స్ కోసం పంపించాలని చెప్పి పక్కకు వెళ్లిపోయారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున 3 గంటల సమయంలో 11 మందిని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.ఇక్కడే అసలైన మాయ జరిగింది. తీసుకెళ్లింది బ్లడ్ సాంపిల్స్ కోసం.. కానీ అక్కడ తీసుకుంది మళ్ళి యూరిన్ శాంపిల్స్ మాత్రమే. ఇక్కడ కూడా 10 మంది యూరిన్ సాంపిల్స్ ఒక వైపుగా తీసుకెళ్లారు. కానీ ఎంపీ పుట్టా మహేష్ యూరిన్ శాంపిల్ మరోవైపు పంపినట్లు సమాచారం. అనంతరం ఈ 11 మందిని శంషాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. రెండవ సారి యూరిన్ సాంపిల్స్ తీసుకున్న సుమారు 5 గంటల తర్వాత, అంటే సుమారు ఉదయం 9 గంటల సమయంలోఈగల్ ఎస్పీ మీడియా ముందుకు వచ్చి, బ్లడ్ శాంపిల్స్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పాజిటివ్ వచ్చిందని ప్రత్యేకంగా ప్రకటించారు. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే మొదటిసారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ ను 10 నిమిషాల్లో బయటికి చెప్పగా రెండవ సారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ 5 గంటల తర్వాత బయట పెట్టడం. ఇక్కడే ఖచ్చితంగా కుట్ర కోణం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఇక్కడ అసలైన, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బ్లడ్ శాంపిలే తీసుకోకుండా, బ్లడ్ రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చిందని ఈగల్ ఎస్పీ ప్రకటించడం. చివరికి రిమాండ్ రిపోర్టులో కూడా ఎక్కడ కూడా బ్లడ్ టెస్ట్ ప్రస్తావన లేదు. కేవలం యూరిన్ టెస్టు అని మాత్రమే ఉంది. మరి బ్లడ్ టెస్ట్ చేయకుండానే పాజిటివ్ వచ్చింది అని ఎస్పీ ఎలా చెప్పారు ? ఇక్కడ అనేక సందేహాలు.. అనేక అనుమానాలు... పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా? ఏలూరు ఎంపీ యూరిన్ శాంపిల్ ఎక్కడికి తీసుకెళ్లారు? పాజిటివ్ రావడం కోసం అందులో ఏదైనా కలిపారా? అయితే ఏలూరు ఎంపీ పై డ్రగ్ ముద్ర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఎస్పీ గిరిధర్ ఒకచోట పప్పులో కాలువేసారు. అదే.. బ్లడ్ టెస్ట్ లో ఏలూరు ఎంపీ కి పాజిటివ్ వచ్చిందని చెప్పడం. ఇక్కడే కచ్చితమైన కుట్ర ఉందని, ఇందులో ఈగల్ ఎస్పీ గిరిధర్ పాత్ర ఉందని అనుమానాలకు బలం చేకూరుతోంది . బ్లడ్ శాంపిల్ తీసుకోకుండానే, బ్లడ్ రిపోర్టులో పాజిటివ్ వచ్చిందని చెప్పిన ఎస్పీ, అదే నిజమైతే బ్లడ్ శాంపిల్ రిపోర్టు బయటపెట్టాలి.పోలిసు విచారణ ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ఎంపీ రెండు గుర్తింపు పొందిన ప్రముఖ ల్యాబుల్లో ?సొంతంగా యూరిన్ టెస్టు చేయించినట్లు తెలిసింది. .. ఆ రిపోర్టు కాపీలను కూడా మనకు దొరికాయి. వీటిలో "నెగెటివ్" గా రిపోర్టు రావడం మీరు చూడొచ్చు... వీటితోపాటు, ఎంపీ పై కుట్ర కోణం అనుమానాలు రేగటానికి మరో బలమైన కారణం ఉంది.అదే, ఎంపీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం.

ఇది కూడా మనకు వచ్చింది.నాలుగేళ్ళ కిందట ఎంపీకి హార్ట్ ఆపరేషన్ జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టులు కూడా ఉన్నాయిఅయన ఇప్పటికీ రెగ్యులర్ గా మందులు వాడుతున్నారు. గుండె సమస్య ఉన్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్స్ వాడటం సాధ్యమేనా? సాధారణ మనిషి గుండె నిమిషానికి 70 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. డ్రగ్స్ తీసుకున్నప్పుడు 150 నుంచి 200 వరకూ వెళ్ళిపోతుందని వైద్యులు చెబుతారు... మరి గుండె సమస్య ఉన్న వ్యక్తి డ్రగ్స్ తీసుకోవడం ఏ విధంగా సాధ్యం?

### ఇప్పుడు తేలాల్సిన విషయాలు

1) ఎంపీ పై డ్రగ్ ముద్ర వేయాలనే కుట్ర వెనుక ఎవరున్నారు?
2) అసలు తలసాని అల్లుడు అని తెలుసుకున్న తర్వాతే ఎస్పీ 2వ సారి టెస్ట్ కు ఆదేశించారా? దానికి కారణం ఏంటి?
3) ఎస్పీ ఏలూరు ఎంపీ గురించి.. తలసాని అల్లుడు అంటూ ఫోన్ లో చెప్పిందెవరికి?
4) పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా?
5) 2వ సారి కూడా యూరిన్ టెస్ట్ చేసి, బ్లడ్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిందని ఎందుకు చెప్పాల్సివచ్చింది?
6) అసలు బ్లడ్ టెస్ట్ చేస్తే రిమాండ్ రిపోర్ట్ లో, ఈఎఫ్ఐ లో బ్లడ్ టెస్ట్ గురించి ఎందుకు రాయలేదు.
7) కొకైన్ తీసుకున్నారని ఒక పక్క పోలీసులు చెబుతూ, ఈఎఫ్ఐ లో కొకైన్ తీసుకున్న ఆనవాళ్లు లేవని చెప్పటం కుట్ర కాదా?
8) యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళ్లు ఏవిధంగా నిర్ధారించారు ?
9) గుండె సంబంధిత, ఒబెసిటీ, డిప్రెషన్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలకు వాడే మందుల వాళ్ళ కూడా యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళ్లు కనిపించే అవకాశం ఉందని తెలిసి కూడా డ్రగ్స్ తీసుకున్నారని ఎలా ప్రకటించారు ?
10. గుండె ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్ తీసుకుంటే బతుకుతాడా?
11. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పై చేసిన కుట్ర వెనుక అసలు సూత్రధారులెవరు? పాత్రధారులెవరు?
12. రాజకీయ చదరంగంలో చేయని నేరానికి ఏలూరు ఎంపీ బలయ్యారా?

# కూటమిని చీల్చేదెలా...

**నెల్లూరు,** కూటమిని విడగొడితేనే రాజకీయ భవిష్యత్ అని వైసీపీ గట్టి నమ్మకంతో ఉంది. పై స్థాయిలో అగ్రనేతలు అందరూ కలసిమెలిసి ఉంటున్నారు. వారి మధ్య విభేదాలు సృష్టించడం సాధ్యం కావడం లేదు. అందుకే వైసీపీ.. జనసేన బలాన్ని తగ్గించేందుకు అంబటి రాంబాబు అస్త్రాన్ని ప్రయోగించింది. కాపు వర్గంలో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వైసీపీకి అది పెద్ద అవకాశంగా స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. ఆ స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల క్యాడర్ ఏకాభిప్రాయంతో ఉండటం కష్టం. అందరూ అవకాశాలు కోరుకుంటారు. ఇలాంటి సమయంలో ఆ పార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి కావాల్సినంత సరుకు లభిస్తుంది. దీన్ని ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపైనే వైసీపీ ప్రణాళికలు ఉండే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం గెలుపు ఓటముల కన్నా వ్యూహ ప్రతివ్యూహాల పర్వం నడుస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , తిరిగి పుంజుకోవడానికి ఒకే ఒక మార్గం ఉందని బలంగా నమ్ముతోంది. అది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని విడగొట్టడం. అగ్రస్థాయి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ మధ్య సయోధ్య బలంగా ఉండటంతో, వారిని విడదీయడం సాధ్యం కాదని గ్రహించిన వైసీపీ.. ఇప్పుడు తన వ్యూహాన్ని క్షేత్రస్థాయికి మళ్లించింది. కూటమికి ప్రధాన బలంగా ఉన్న జనసేన ఓటు బ్యాంక్, ముఖ్యంగా కాపు సామాజికవర్గంలో గందరగోళం సృష్టించే బాధ్యతను వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు భుజానికెత్తుకున్నారు. పవన్ కళ్యాణ్ తన సామాజికవర్గాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారనే పాత విమర్శకు కొత్త పదును పెడుతూ, కాపు వర్గంలో విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోంది.

జనసేన బలం తగ్గితే తప్ప తమకు భవిష్యత్తు లేదని భావిస్తున్న వైసీపీ, సామాజిక సమీకరణాల ద్వారా కూటమి పునాదులను కదిలించే పనిలో పడింది. వైసీపీకి త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఒక గొప్ప అవకాశంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు సర్దుకుపోయినట్లుగా, స్థానిక ఎన్నికల్లో గ్రామ స్థాయి క్యాడర్ సర్దుకుపోవడం దాపు అసాధ్యం. ప్రతి ఊరిలోనూ మూడు పార్టీలకు చెందిన ఆశావహులు ఉంటారు. సీట్ల కేటాయింపు దగ్గర మొదలయ్యే అసంతృప్తిని క్యాష్ చేసుకోవడమే వైసీపీ అసలు ప్లాన్. ఎక్కడైతే కూటమిలో విభేదాలు వస్తాయో, అక్కడ తటస్థులను లేదా అసంతృప్త నేతలను ప్రోత్సహించడం ద్వారా చిచ్చు పెట్టాలని వైసీపీ భావిస్తోంది. వైసీపీకి ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలిచామన్న దానికంటే, కూటమి పార్టీల మధ్య ఎంత దూరం పెంచామన్నదే ప్రధానం. "కూటమిలో ఏకాభిప్రాయం లేదు అనే ముద్ర వేయగలిగితే, అది వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి పెద్ద చీలికకు దారితీస్తుందని వారి నమ్మకం. క్యాడర్ స్థాయిలో గొడవలు మొదలైతే, అవి సహజంగానే పైస్థాయి నేతలపై ఒత్తిడి పెంచుతాయి. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు, స్థానిక సీట్ల కోసం మూడు పార్టీల కార్యకర్తలు పోటీ పడుతుంటారు. అందరికీ అవకాశాలు కల్పించడం ఏ ప్రభుత్వానికైనా కష్టసాధ్యమైన పని. ఈ డిమాండ్ అండ్ సప్లై గ్యాప్‌ను వైసీపీ తన అనుకూలతగా మార్చుకోనుంది. కూటమి నేతల మధ్య ఈగో సమస్యలను రాజేయడం, ఒక పార్టీకి దక్కిన ప్రాధాన్యత మరో పార్టీకి దక్కలేదని ప్రచారం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతను దెబ్బతీయడమే వైసీపీ ప్రస్తుత రాజకీయ ఎజెండా. వైసీపీకి ఇప్పుడు కావాల్సింది స్వంత బలం పెంచుకోవడం కంటే, శత్రువుల మధ్య బలహీనతను వెతకడమే. స్థానిక ఎన్నికల్లో గెలవడం ద్వారా వచ్చే ఫలితం కంటే, కూటమి పార్టీల మధ్య శాశ్వత పగ ను సృష్టించడమే వైసీపీ సాధించాలనుకుంటున్న అసలైన గెలుపు. చంద్రబాబు రాజకీయ చాణక్యం, పవన్ కళ్యాణ్ అంకితభావం ఈ వ్యూహాలను ఎలా తిప్పికొడతాయనేది వేచి చూడాలి.

# ట్రాప్‌లో వైసీపీ పడిందా

**కాకినాడ,** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల జరిగిన రెండు భారీ మానవ తప్పిదాలు రాష్ట్రాన్ని కుదిపేశాయి. వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో 28 మంది, రాజమండ్రి కల్తీ పాలు సేవించి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 42 కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చిన ఈ ఘటనలు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వైసీపీ ఈ ఘటనల పట్ల స్పందించిన తీరు, పార్టీ అగ్ర నాయకత్వం వహించిన మౌనం ఇప్పుడు ఆ పార్టీలోనే అంతర్గత మథనానికి కారణమవుతోంది.వేట్లపాలెంలో బాణసంచా తయారీలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల 28 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరోవైపు, రాజమండ్రిలో కల్తీ పాల సరఫరా కారణంగా మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ 14కు చేరింది. ఈ ఘోరాలు జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఇంతటి భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగినప్పుడు, ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ దూకుడుగా వ్యవహరించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో బాధితులకు భరోసా ఇవ్వడంలో పార్టీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి బాధితులను పరామర్శించి ఉంటే బాగుండేదని పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి. గతంలో పిఠాపురంలో ఇలాంటి ప్రమాదం జరిగినప్పుడు జగన్ స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మరి ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదం జరిగినా ఎందుకు స్పందించలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.అయితే ఈ ఘటనలపై జగన్ కు సరైన సమాచారం లేదని కొంమంది చెప్తున్నారు. తాము జరిగిన విషయాన్ని ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలకు వివరించామని, నిర్ణయం తీసుకోవాల్సింది పైస్థాయి నాయకత్వమేనని జిల్లా నేతలు వాదిస్తున్నారు. అయితే.. జిల్లా నేతలు కేవలం సమాచారం ఇచ్చి వదిలేయకుండా, పదే పదే గుర్తు చేసి ఉండాల్సిందని, వారిలో చొరవ లోపించిందని పార్టీ పెద్దలు విమర్శిస్తున్నారు. ఇక్కడ మరో వాదన కూడా వినిపిస్తోంది. గోదావరి జిల్లాల్లో పార్టీ పెద్దగా యాక్టివ్ గా లేదని, కేడర్ మొత్తం చిన్నాభిన్నమైందని కొందరు చెప్తున్నారు. అందుకే ఈ జిల్లాకు రావడానికి జగన్ ఇష్టపడలేదని పార్టీలోని కొన్ని వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారు, ప్రభావితమైన వారు వైసీపీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న సామాజిక వర్గాలేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. రాష్ట్రంలో ఇతర పెద్ద రాజకీయ అంశాలు లేని సమయంలో కూడా, ప్రభుత్వం విఫలమైన కోణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైసీపీ ఆలస్యం చేసిందని పార్టీ వర్క్ షాప్ లో కూడా చర్చకు వచ్చింది.రాజకీయాలను పక్కన పెడితే, ఇంతటి భారీ మానవతా సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజల పక్షాన నిలవాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నా, కమ్యూనికేషన్ లోపాలు లేదా వ్యూహాత్మక తప్పిదాల వల్ల వైసీపీ ఈ విషయంలో వెనకబడిందనేది స్పష్టమవుతోంది

# కథ కంచికేనా...

**కడప,** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి మృతిపై ఇక ఏమీ తేలదు. ఇప్పటికి ఇంతే. సీబీఐ కూడా సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసులో కొత్తగా ఎవరినీ నిందితులుగా చేర్చలేదని, అదనపు ఆధారాలు లభించలేదని నివేదించింది. ట్రయల్ కోర్టు లో విచారణను వేగవంతం చేసి, నాలుగు వారాల్లోగా ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసులో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలన్న విజ్ఞప్తులను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత పోరాటం కూడా ముగిసినట్లేనని అనుకోవాలి. ఇక వైఎస్ వివేకా మృతిలో మిస్టరీ వీడే అవకాశం లేనట్లే కనిపిస్తుంది.వైఎస్ వివేకా మృతి జరిగి ఏడేళ్లు కావస్తుంది. గొడ్డలి పోట్లు ఉండటంతో అది హత్య అని అందరూ ఆరోపించు. ఇప్పటి వరకూ హత్యకు గల కారణాలు.. హత్య చేసిందెవరన్నది తేల్చలేకపోయారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత ఒంటరి పోరాటం చేస్తున్నారు. న్యాయ పోరాటం చేశారు. ఈ హత్య కేసులో ఆధారాలు లభించలేదా? లేక ఆధారాలను చెరిపేయడంతో విచారణలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదా? మరి దేశంలోనే అనేక క్లిష్టమైన కేసులను పరిష్కరించిన సీబీఐ వల్ల కూడా కాలేదంటే అసలు ఈ కేసు ఇక మూలనపడినట్లేనని అంటున్నారకు.ఒక హత్య జరిగితే వెంటనే దానికి గల కారణాలను, నిందితులను ఎక్కడున్నా పట్టుకునే దర్యాప్తు అధికారులు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మిస్టరీని ఎందుకు ఛేదించలేకపోతున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి ఆధారాలున్నా.. ఏమాత్రం సాంకేతికమైన చిన్నపాటి క్లూ లు లభించినా దర్యాప్తు అధికారులు వదిలిపెట్టే ప్రశ్న ఉండదు. కానీ వివేకానంద రెడ్డి హత్య జరిగింది 2019లో. ఏడేళ్లుగా కుమార్తె డాక్టర్ సునీత పోరాటం చేస్తుంది. కానీ హత్యకు గల కారణాలు కూడా తెలియరాలేదు. ఇక నిందితులెవరూ లేరని, అందుకు తగిన ఆధారాలు లభించలేదని చెప్పడంతో వైఎస్ వివేకా హత్య కేసు ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోనుంది.వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అనేక విషయాలు గత ఏడేళ్లుగా ప్రచారంలో ఉన్నాయి. వాటిలో నిజానిజాలు ఆ భగవంతుడికే తెలియాలి. వాటికి ఎటువంటి ఆధారాలు లేవు. ఒక మాజీ ముఖ్యమంత్రి సోదరుడు, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురయి ఇన్నేళ్లవుతున్నా కనీసం హత్యకు గల కారణాలను బయట ప్రపంచానికి తెలియకపోవడంతో ఇక దర్యాప్తు సంస్థలపై కూడా ప్రజలకు దురభిప్రాయం ఏర్పడే అవకాశముంది. అలాంటి వారికే న్యాయం జరగనప్పుడు ఇక సామాన్యులకు సరైన న్యాయం ఎందుకు జరుగుతుందన్న ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. వైఎస్ వివేకానందరెడ్డిది సహజ మరణం కాదు.కానీ అందుకు గల కారణాలు ఇప్పటి వరకూ తెలియకపోవడం మాత్రం దురదృష్టకరమే.

## యువతి మృతి..ప్రేమోన్మాది దాడని
# కుటుంబికుల ఆరోపణ

**సికింద్రాబాద్** ప్రేమోన్మాది ఘాతుకానికి మరో యువతి బలైన ఘటన సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్ నగర్ లో నివాసం ఉంటున్న రమాదేవి, కోటేశ్వరరావు కూతురు జెనీమా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అయితే ఇటీవల పరిచయమైన జగదీష్ అనే యువకుడు తన కూతురును వేధించడని తల్లి రమాదేవి తెలిపింది. వేధింపులతో ఆగకుండా ఈ రోజు ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న తన కుతురుపై దాడి చేశాడని తెలిపింది. మళ్ళీ తన దగ్గరకు వచ్చి తన కూతురు ఇంట్లోకి వెళ్లి తలుపు పెట్టుకుంది తలుపులు తీయడం లేదని ఇంటికి తీసుకు వచ్చాడని చెప్పింది. ఇంట్లోకి ప్రవేశించి ఉరి వేసుకొని వేలాడుతున్నా తమ కుతురును కిందకు దించి సిపీఆర్ చేశామని పేర్కొంది. అప్పటికి బ్రతికే ఉందని అంబులెన్స్ రావడం ఆలస్యం అవ్వడంతో స్థానికుల సహాయంతో ఆటోలో గాంధీకి తరలించామని కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారని వెల్లడించింది. తన కూతురును జగదీష్ విపరీతంగా కొట్టిన గాయాలు శరీరంపై ఉన్నాయని తెలిపింది. తన ఒక్కగానొక్క కూతురును మృతికింకారణమైన జగదీష్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# విజయ్‌కు కలిసి రాని కాలం

**చెన్నై** తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన పార్టీ తమిళగ వెట్రి కళగం ద్వారా ఒక పెను సంచలనం సృష్టిస్తారని ఆశించిన అభిమానులకు, తాజా పరిణామాలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయాల్లోకి రాకముందే బలమైన సోషల్ మీడియా వింగ్‌ను సిద్ధం చేసుకున్న విజయ్, క్షేత్రస్థాయిలో వరుస తప్పిదాలతో ఆ మూమెంటంను కోల్పోతున్నారు.పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో నిర్వహించిన ర్యాలీల్లో కరూర్ జిల్లాలో జరిగిన తొక్కిసలాట ఘటన విజయ్ రాజకీయ పరిపక్వతపై ప్రశ్నలు లేవనెత్తింది. సుమారు 41 మంది మరణించిన ఈ దుర్ఘటన తర్వాత, విజయ్ నేరుగా ప్రజల మధ్యకు వెళ్లడానికి భయపడుతున్నారనే ప్రచారం మొదలైంది. భారీ జనసందోహాన్ని నియంత్రించడంలో విఫలమవ్వడం, కేవలం సోషల్ మీడియాకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసిస్తోంది. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు అటు డీఎంకే, ఇటు ఏఐఏడీఎంకే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి.కరూర్ ఘటన తర్వాత మెల్లగా ప్రజల్లోకి వస్తున్న సమయంలో కుటుంబ సమస్యలు రోడ్డున పడ్డాయి. భార్య విడాకుల కోసం కోర్టుకెక్కడం, త్రిషతో వివాహేతర బంధం అనే ప్రచారంతో పాటు తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్‌తో ఉన్న విభేదాలు కూడా హాట్ టాపిక్ గా మారాయి. ఒక నాయకుడిగా తన కుటుంబాన్నే ఏకతాటిపైకి తీసుకురాలేని వ్యక్తి, రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారనే ప్రతిపక్షాల విమర్శలకు ఇది ఆస్కారం ఇస్తోంది.అన్నీ చక్కదిద్దుకుని ముందుకు వెళ్తామనుకుంటున్న దశలో, టీవీకే నేత ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలు సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులను ఆగ్రహానికి గురిచేశాయి. రజనీకాంత్‌ను డీఎంకే బెదిరించిందని, అందుకే ఆయన వెనక్కి తగ్గారని ఆధవ్ అర్జున చేసిన ఆరోపణలు చివరకు రజనీ ప్రతిష్టను దెబ్బతీసేలా మారాయి. తమిళనాడులో రజనీకాంత్ అభిమానుల మద్దతు ఏ పార్టీకైనా చాలా ముఖ్యం. అలాంటిది అనవసరంగా వారిని శత్రువులుగా మార్చుకోవడం విజయ్ చేసిన అతిపెద్ద రాజకీయ తప్పిదంగా విశ్లేషకులు భావిస్తున్నారు.విజయ్ పార్టీ సోషల్ మీడియాలో ఎంత బలంగా కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం ఇంకా బలపడలేదు. కేవలం స్టార్ పవర్ మీద ఆధారపడి, సీనియర్ రాజకీయ నేతలను ఎదుర్కోవడం అసాధ్యమని రాజకీయవర్గాలు ఓ క్లారిటీకి వస్తున్నాయి.

## ఉప్పల్ బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఘనంగా పుట్టినరోజు వేడుకలు

**- బిజెపి పార్టీ తోనే హైదరాబాద్ మహానగరం అభివృద్ధి సాధ్యం**

**- రాబోయే గ్రేటర్ ఎన్నికలలో బిజెపి పార్టీ మేయర్ పీఠం కైవసం చేసుకుంటుంది రామ ప్రదీప్ మునుగంటి**





నాచారం(ప్రశ్న న్యూస్) ఉప్పల్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని హౌసింగ్ బోర్డ్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు మునుగంటి రాంప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డ్ డివిజన్ అధ్యక్షులు రాంప్రదీప్ మాట్లాడుతూ బిజెపి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలదండ వేసి సన్మానించడం జరిగిందని, అనంతరం ఆయన పుట్టినరోజు సందర్భంగా హెచ్ బి కాలనీ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని చలివేంద్రాన్ని బీజేపీ డివిజన్ ఫౌండర్ కంచర్ల గోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో రోజురోజుకి బిజెపి పార్టీ బలం పెరుగుతుందని కొద్ది రోజుల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో మనం చూడడం జరిగిందని గతంలో ఎమ్మెల్యే స్థానాలు ఎంపీల స్థానాలు ఎన్ని ఉన్నాయో అంతకు ఎక్కువగా పెరిగాయని బిజెపి పార్టీతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సహకారం అవుతుందని డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు సజావుగా సాగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం ఆరంభం - సన్మార్గానికి సంకేతం

**- బోయినిపల్లి గ్రామ సర్పంచ్ : నల్ల మోహన్**

**- బోయినిపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు**

**- పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్ర గ్రామంలో ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నల్ల మోహన్, పాలకవర్గం ఆధ్వర్యంలో స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షడ్రుచుల ఉగాది పచ్చడిని గ్రామ ప్రజలకు, భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు పంచాంగ శ్రవణం చేసి నూతన సంవత్సర ఫలితాలను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల మోహన్ మాట్లాడుతూ ఉగాది పండుగ మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. షడ్రుచుల పచ్చడి మన జీవితంలో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని, నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.అలాగే గ్రామాభివృద్ధికి పాలకవర్గం కట్టుబడి పనిచేస్తుందని, ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. చివరిగా గ్రామ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తితో జన్మదిన - పెళ్లిరోజు వేడుకలు

**- పర్యావరణ పరిరక్షణ దిశగా మొక్కలు నాటిన చిందం ప్రణీత,పొన్నం తిరుపతి - స్వరూప దంపతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడగొండ గ్రామ మాజీ సర్పంచ్ చిందం రమేష్ - జాహ్నవి దంపతుల చిన్న కుమార్తె చిందం ప్రణీత తన పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటగా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొన్నం తిరుపతి -- స్వరూప దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా మొక్కలు నాటారు.మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేనలో భాగంగా, ఇరువురి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి మున్నూరుకపు సంఘం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "చెట్లు మన జీవనానికి ఆధారం. వేసవికాలంలో చెట్ల ప్రాముఖ్యత మరింతగా తెలుస్తుంది. వర్షపాతం సమృద్ధిగా ఉండాలంటే, చల్లటి వాతావరణం ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం రమేష్, వార్డు మెంబర్ బుర్ర రాజు, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు సింగరి రమేష్, రెండ్ల వెంకటేష్, చేపూరి మహిపాల్, చిందం తిరుపతి, విలాసాగర్ వెంకటేష్, ముధం కమలాకర్, బొడ్డు రమేష్, కట్ట లింగయ్య, చిందం శశి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యుడు కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి - గ్రామస్థుల ఐక్యతతోనే గ్రామాభివృద్ధి

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**

**- నీలోజిపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు -- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో గురువారం పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు గోపన్న పంచాంగ శ్రవణం గావించారు. అనంతరం పండితులు గోపన్నను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, "ఉగాది పర్వదినం మన తెలుగు ప్రజల నూతన ఆరంభాలకు ప్రతీక. ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. గ్రామాభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తే మరింత అభివృద్ధి సాధించగలం. రైతులు పుష్కలమైన పంటలు పండించి ఆనందంగా ఉండాలని, యువత మంచి అవకాశాలు సాధించాలని ఆశిస్తున్నాను. ఈ సంవత్సరంలో మన నీలోజిపల్లి గ్రామం అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా కృషి చేస్తా " అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు భక్తి శ్రద్దలతో పెద్ద సంఖ్యలో పాల్గొని ఉగాది వేడుకలను జయప్రదం చేశారు.

# మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా ఉగాది వేడుకలు - పంచాంగ శ్రవణం





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, పండితులచే పంచాంగ శ్రవణం గావించి, షడ్రుచుల ఉగాది పచ్చడిని గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు.**తడగొండలో** తడగొండ గ్రామంలో సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్, పాలకవర్గం ఆధ్వర్యంలో సాయి రాం నేతృత్వంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.- **బూరుగుపల్లిలో** బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్, ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సౌమ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.**విలాసాగర్ గ్రామంలో** విలాసాగర్ గ్రామంలో సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, పాలకవర్గం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ శ్రీ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితుడు పురాణం శ్యామ్ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించి రాబోయే సంవత్సర ఫలితాలను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కనుకయ్య మాట్లాడుతూ, "ఉగాది పండుగ మన సంస్కృతికి ప్రతీక. ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. కొత్త సంవత్సరంలో గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేసి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పని చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా ఉగాది

## హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో హిందూ సంఘాల పాత్ర కీలకం

**ఆర్ ఎస్ ఎస్ ఉగాది ఉత్సవాల్లో**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా**




నిజామాబాద్(ప్రశ్న న్యూస్)హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ,హిందూ సంఘాల పాత్ర ఎంతో కీలకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ... హిందువుల ప్రతి పండుగను, ఆచార వ్యవహారాలను చాటి చెప్పడంలో ఆర్ఎస్ఎస్ ముందుంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో హిందువులు జాగృతమవడమే కాకుండా ఐక్యత పెరుగుతుందన్నారు. కేవలం సేవనే కాకుండా పండుగల విశిష్టతను తెలియజేయడం ఎంతో గర్వనీయమన్నారు. ప్రధానంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ పుట్టినరోజు కూడా ఉగాది రోజునే కావడం ఎంతో విశిష్టమైందన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయాలను పాటిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం చేసిన మాకునూరి పురుషోత్తమాచార్యులుని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జక్కా రవి, తెలంగాణ ప్రాంత సహ్ బౌద్ధిక్ ప్రముఖ్, ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మదం స్థానం నుంచి నామినేషన్ వేసిన కేరళ సీఎం పినరయి విజయన్

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల కు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం నగారా మోగించింది. అప్పటి నుంచి ఆ నాలుగు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాంలలో, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికల కోలాహలం నెలకొన్నది. అభ్యర్థుల ఎంపిక, జాబితాల విడుదల, నామినేషన్‌లతో పార్టీలు బిజీబిజీగా ఉన్నాయి. ఇవాళ కేరళ లోని ధర్మదం నియోజకవర్గం నుంచి సీఎం పినరయి విజయన్ నామినేషన్ దాఖలు చేశారు. ఏప్రిల్ 9న కేరళలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో అక్కడి నామినేషన్‌ల పర్వం మొదలైంది. అందులో భాగంగానే విజయన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో తలస్సెరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు బుధవారం తన నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా ప్రచారం మొదలుపెట్టిన విజయన్ తన రాజకీయ జీవితంలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడం ఇది ఏడోసారి.ధర్మదం నుంచి బరిలో దిగడం ఇది మూడోసారి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలువగా.. బీజేపీ అభ్యర్థిగా రంజిత్ పోటీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 9న 140 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది.

## ఆరేళ్లలో 18 వేల గుండెపోటు మరణాలు.. అసెంబ్లీలో ఆ రాష్ట్ర సర్కారు వెల్లడి



కరోనా మహమ్మారి వచ్చిపోయిన తర్వాత దేశంలో గుండెపోటు మరణాలు పెరిగిపోయాయి. కరోనా వ్యాక్సిన్ లే ఇందుకు ప్రధాన కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ కొందరు మాత్రం వ్యాక్సిన్‌లు కారణం కాదని అంటున్నారు. ఈ నేపథ్యంలో హర్యానా లో గత ఆరేళ్లలో సంభవించిన గుండెపోటు మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. గడిచిన ఆరేళ్లలో 18-45 ఏళ్ల వయసువాళ్లు దాదాపుగా 18వేల మంది హార్ట్‌ఎటాక్‌తో మరణించినట్టు అసెంబ్లీ వేదికగా హర్యానా సర్కారు ప్రకటించింది.యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. 2020 జనవరి నుంచి 2026 జనవరి వరకు ఏ జిల్లా నుంచి ఎంతమంది, ఏ వయసు వారు గుండెపోటుతో మరణించారో తెలుపాలని ఎమ్మెల్యే అడిగారు. ఆ మరణాలకు కరోనా వైరస్‌తో, కొవిడ్ వ్యాక్సినేషన్‌తో ఏమైనా సంబంధం ఉందా..? ఆ దిశగా ఏమైనా సర్వే చేపట్టారా..? అని ప్రశ్నించారు. దాంతో అలాంటి సర్వే నిర్వహించలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. కాకపోతే జిల్లాల వారీగా సేకరించిన సమాచారాన్ని ఇచ్చింది. 2020లో 2,394 మంది, 2021లో 3,188 మంది, 2022లో 2,796 మంది, 2023లో 2,886 మంది, 2024లో 3,063 మంది, 2025లో 3,255 మంది, 2026 జనవరిలో 391 మంది, ఇలా మొత్తంగా 17,973 మంది హార్ట్‌ఎటాక్‌తో మరణించినట్లు ప్రభుత్వం తెలిపింది. యమునానగర్ జిల్లాలో అత్యధికంగా, రోహ్‌తక్ జిల్లాలో అన్నింటికంటే తక్కువగా ఈ మరణాల సంఖ్య ఉందని ప్రభుత్వం పేర్కొన్నది.

## ఎమ్మెల్సీ పదవా.. దేవుడే చూసుకుంటాడు!.. మంత్రి అజారుద్దీన్ కీలక వ్యాఖ్యలు

**మంత్రి అజారుద్దీన్ కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ పదవిపై మంత్రి అజారుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్సీ పదవి ఎప్పుడు వస్తుందంటూ అజారుద్దీన్‌ను విలేకరులు ప్రశ్నించగా... వ స్తుంది అని ఆయన సమాధానమిచ్చా రు. వెంటనే విలేకరులు 'ఎలా వస్తుం ది..? మరో నెల రోజులే గడువు ఉంది కదా..?' అంటూ ప్రశ్నించగా 'ఊపర్ భగవాన్ హై' అంటూ సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కానటువంటి అజారుద్దీన్‌కు కాంగ్రెస్ మంత్రి పదవి ఇచ్చారు. అయితే ఆర్నెల్లలోపు ఆయన ఏదో ఒక చట్టసభలో సభ్యుడిగా ఉండాలి. మరో నెల రోజుల్లో ఆయన ఎమ్మెల్సీ కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.




# డ్రగ్స్ కేసులో నన్ను టార్గెట్ చేశారు..

## - కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినా ఆ బాధ మర్చిపోలేను: నటి హేమ

దాదాపు రెండేళ్ల క్రితం బెంగళూరులో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ కేసులో పలువురు తెలుగు వ్యక్తుల పేర్లు వినిపించడంతో పాటు సీనియర్ నటి హేమ పేరు కూడా బయటకు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. అయితే అనంతరం కోర్టు ఆమెకు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆ వివాదం క్రమంగా సద్దుమణిగింది. ఇటీవల తెలంగాణలో మరోసారి డ్రగ్స్ కేసులు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఆ పాత కేసును ప్రస్తావిస్తూ హేమ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌పై తెలంగాణ ఈగల్ టీమ్, పోలీసులు దాడులు నిర్వహించగా డ్రగ్స్ పార్టీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు రాజకీయ నేతల పేర్లు వినిపించడంతో ఇది పెద్ద చర్చకు దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో గతంలో బెంగళూరులో జరిగిన డ్రగ్స్ కేసును గుర్తు చేసుకుంటూ హేమ తన అనుభవాలను పంచుకున్నారు. 2024 మే 19న బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ సమీపంలోని జీఆర్ ఫామ్ హౌస్‌లో రేవ్ పార్టీ జరుగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు మే 20 తెల్లవారుజామున దాడులు చేపట్టారు. ఆ సమయంలో మొత్తం 88 మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో 9 మంది నిర్వాహకులు ఉండగా, మిగిలిన వారిపై డ్రగ్స్ వినియోగించారన్న ఆరోపణలు నమోదయ్యాయి. హేమతో పాటు మొత్తం 79 మంది డ్రగ్స్ వినియోగించారన్న ఆరోపణలతో పోలీసులు కోర్టులో వెయ్యికి పైగా పేజీల ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో తాను ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోలేదని అప్పట్లోనే చెప్పినప్పటికీ, తనపై తీవ్ర ఆరోపణలు కొనసాగాయని హేమ అన్నారు. తాను ఒక సెలబ్రిటీ కావడం వల్లే తనపై ఎక్కువగా ప్రచారం జరిగిందని ఆమె అభిప్రాయపడ్డారు.

కొన్ని మీడియా సంస్థలు తనపై వచ్చిన ఆరోపణలను పదేపదే ప్రసారం చేసినప్పటికీ, తరువాత తాను నిర్దోషినని తేలిన విషయాన్ని మాత్రం పెద్దగా ప్రస్తావించలేదని ఆమె విమర్శించారు. ఈ కేసులో విచారణ అనంతరం 2025 జనవరి 2న బెంగళూరు కోర్టు హేమ వాదనలు పరిశీలించి, ఆమె డ్రగ్స్ వినియోగించలేదని తేల్చి క్లీన్ చిట్ ఇచ్చింది. దీంతో తాను నిర్దోషినని న్యాయపరంగా నిరూపితమైందని హేమ తెలిపారు. కేసు విచారణ కొనసాగిన సమయంలో తాను తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యానని హేమ వెల్లడించారు. ఎన్నిసార్లు తనకు తప్పు లేదని చెప్పినా ఎవరూ నమ్మలేదని ఆమె గుర్తు చేసుకున్నారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే నిజం బయటపడిందని చెప్పారు. డ్రగ్స్ కేసుల్లో అరెస్టయితేనే దోషులని భావించడం సరైంది కాదని హేమ అన్నారు. జైలుకు వెళ్లినంత మాత్రాన ఎవరు నేరం చేసినట్టు కాదు అని ఆమె స్పష్టం చేశారు.




# మాట నిలబెట్టుకున్న అల్లు అర్జున్..

## తండ్రిని కోల్పోయిన దుర్గకు నెలకు 7,500 సాయం

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా వేట్లపాలెంలో ఇటీవల జరిగిన బాణసంచా పేలుడు ప్రమాదం రాష్ట్రాన్ని కలచివేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో సుమారు 23 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనలో అనేక కుటుంబాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో కడింపల్లి దుర్గ అనే మానసిక దివ్యాంగురాలు తన తండ్రిని కోల్పోయింది. అంతకు ముందు ఆమె తల్లి కూడా తీవ్ర అనారోగ్యంతో మరణించడంతో దుర్గ అనాథలా మిగిలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వెంటనే స్పందించి ఆమెకు అండగా నిలిచారు. దుర్గ పరిస్థితిని గుర్తించిన అల్లు అర్జున్ ప్రతినెలా రూ.7,500 ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. ఆమెకు జీవితాంతం కనీస ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు బన్నీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మొదటి నెలకు సంబంధించిన రూ.7,500ను దుర్గ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఈ విషయాన్ని దుర్గ తరపున వ్యక్తి సోషల్ మీడియాలో పంచుకుంటూ అల్లు అర్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం బయటకు వచ్చిన వెంటనే అల్లు అర్జున్ అభిమానులు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలిచిన బన్నీపై అభిమానులు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆ మధ్య అల్లు అర్జున్ తన మంచి మనసు చాటుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సినీనటి పావలా శ్యామలకు కూడా ప్రతినెలా ఆర్థిక సహాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇక సినిమాల విషయానికి వస్తే, ప్రస్తుతం అల్లు అర్జున్ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ దర్శకత్వంలో ఒక భారీ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. అదే సమయంలో మరో కోలీవుడ్ స్టార్ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కూడా అల్లు అర్జున్ ఒక సినిమా చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. త్వరలోనే ఈ రెండు ప్రాజెక్టుల నుంచి అధికారిక అప్డేట్స్ వచ్చే అవకాశముందని సినీ

# ఉస్తాద్ భగత్‌సింగ్‌తో కల నెరవేరింది



'పవన్‌కల్యాణ్ నుంచి అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. నేను రికార్డులను మనసులో పెట్టుకోలేదు. ఎందుకంటే కలెక్షన్స్ ఎప్పుడూ విడుదల తేదీపై ఆధారపడి ఉంటాయి. సంక్రాంతికి ఓరకంగా , సమ్మర్‌లో మరోరకంగా ఉంటాయి. అయితే ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పగలను. ఈ సినిమా చూసిన తర్వాత 'ఇలాంటి సినిమా వచ్చి చాలా రోజులైంది' అని అందరూ అనుకుంటారు' అన్నారు దర్శకుడు హరీశ్‌శంకర్. ఆయన నిర్దేశకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం రిలీజ్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు హరీశ్‌శంకర్ పై విధంగా స్పందించారు. అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేసేలా అన్ని హంగులతో ఈ సినిమాను తీర్చిదిద్దామని ఆయన చెప్పారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలన్నది మా కల. అది ఉస్తాద్ భగత్‌సింగ్‌తో నెరవేరింది. ఈ సినిమా టికెట్ రేట్లు పెంచలేదు. మామూలు రేట్లకు ఎంత వసూళ్లు వస్తాయో చూద్దామని ఆ ప్రయత్నం చేయలేదు. పవన్‌కల్యాణ్ ఈ సినిమా కోసం ఒక్కోసారి 15 గంటలు కూడా కష్టపడ్డారు.

గురువారం ఉదయం నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్‌షోలు ప్రారంభమవుతాయి' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయికలు శ్రీలీల, రాశీఖన్నా పాల్గొన్నారు.

# మైసా.. వేట మొదలైంది!



అగ్ర తారలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. దాదాపు రెండు వారాల పాటు వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో బిజీగా ఉన్న రష్మిక మందన్న తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టింది. తాజాగా ఆమె పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో జాయిన్ అయ్యింది.

ఈ సినిమాలో రష్మిక మందన్న గోండు తెగకు చెందిన యోధురాలి పాత్రలో కనిపించనుంది.కెరీర్‌లో తొలిసారి రష్మిక మందన్న ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌ని చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం షూట్‌లో భాగంగా ఆమెపై యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ ఆండీలాంగ్ నేతృత్వంలో ఈ ఎపిసోడ్‌ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. 'మైసా' చిత్రీకరణ తాలూకు ఫొటోను అభిమానులతో పంచుకుంది రష్మిక మందన్న. దీనికి 'వేట మొదలైంది' అనే క్యాప్షన్‌ను జత చేసింది. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది.

# 'ధురంధర్ 2'కి బ్లాక్‌బస్టర్ టాక్..

## - కానీ తెలుగు ప్రేక్షకులకు నిరాశ, టెక్నికల్ సమస్యలతో షోలు రద్దు



బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్ హీరోగా, దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2 : ది రివెంజ్' ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. గతేడాది సంచలనం సృష్టించిన 'ధురంధర్' సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు తగ్గట్టుగానే సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించింది. అయితే హిందీ వెర్షన్ విజయవంతంగా ప్రదర్శితమవుతున్నప్పటికీ, దక్షిణాది ప్రేక్షకులకు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని అభిమానులకు నిరాశ ఎదురైంది. సినిమా విడుదలైన తొలి షో నుంచే 'ధురంధర్ 2'కు పాజిటివ్ టాక్ వచ్చింది. రణవీర్ సింగ్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, దర్శకుడు ఆదిత్య ధర్ టేకింగ్ అంతర్జాతీయ స్థాయిలో ఉందని సినీ విమర్శకులు ప్రశంసిస్తున్నారు. ఇక సినిమాలో కీలక పాత్రల్లో నటించిన మాధవన్, సంజయ్ దత్ తమ నటనతో సినిమాకు మరింత బలం చేకూర్చారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాను చూసిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా సోషల్ మీడియాలో స్పందించారు. "దేశభక్తిని చాలా స్టైలిష్‌గా చూపించారు... ప్యాట్రియాటిసం విత్ స్వాగ్ " అంటూ ఆయన చేసిన కామెంట్ సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. అయితే తెలుగు, తమిళ భాషల్లో భారీగా విడుదల కావాల్సిన ఈ సినిమా సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైంది. డబ్బింగ్ పనులు ఆఖరి నిమిషం వరకు కొనసాగడం వల్ల కంటెంట్ డెలివరీలో జాప్యం ఏర్పడింది. దీనివల్ల బుధవారం రాత్రి పడాల్సిన పెయిడ్ ప్రీమియర్ షోలు కూడా రద్దు అయ్యాయి. ఇక సెన్సార్ బోర్డు సూచించిన కొన్ని మార్పుల కారణంగా చివరి నిమిషంలో కొన్ని సీన్లను ఎడిట్ చేయాల్సి వచ్చింది. దీంతో డబ్బింగ్ ఫైల్స్ మిక్సింగ్‌లో సమస్యలు ఏర్పడి డిజిటల్ ప్రింట్లు థియేటర్లకు చేరడంలో ఆలస్యం జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లోని కొన్ని మల్టీప్లెక్స్‌లలో హిందీ వెర్షన్‌ను మాత్రమే సబ్‌టైటిల్స్‌తో ప్రదర్శిస్తున్నారు. తెలుగు వెర్షన్ కోసం ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకున్న వారికి థియేటర్ యాజమాన్యాలు రీఫండ్ ఇస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చిత్రబృందం వేగంగా పని చేస్తోంది. డిజిటల్ ప్రింట్లు థియేటర్లకు చేరే ప్రక్రియ కొనసాగుతోందని సమాచారం. అన్ని సమస్యలు పరిష్కారమైతే శుక్రవారం నుంచి తెలుగు వెర్షన్ షోలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# శర్వానంద్ జోడీగా?



ఒకప్పుడు తెలుగులో ఓ వెలుగువెలిగిన కన్నడ భామ పూజాహెగ్డే గత ఐదేళ్లుగా రేసులో పూర్తిగా వెనకబడింది. టాలీవుడ్‌లో పూర్వ వైభవం కోసం ఎదురుచూస్తున్న ఈ సొగసరికి ప్రస్తుతం పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. తెలుగులో దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఆమె ఓ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా వుండగా ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. శర్వానంద్ కథానాయకుడిగా సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. 'జార్జ్‌క్రిష్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని సమాచారం. కథానుగుణంగా ఇద్దరు నాయికలకు చోటుందని, ఇప్పటికే రుక్మిణి వసంత్ పేరును ఖరారు చేయగా, మరో కథానాయికగా పూజాహెగ్డే వైపు చిత్రబృందం మొగ్గ చూపుతున్నట్లు తెలిసింది. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది

## కాంగ్రెస్ యువ నేతకు జిల్లా కార్యదర్శి పదవి

**పుల్లబోయిన దుర్గేష్ సేవను గుర్తించిన అధిష్టానం**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం యువజన కాంగ్రెస్ నేత పుల్లబోయిన దుర్గేష్ కు చక్కని అవకాశం దక్కింది. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న కార్యకర్తలకు అధిష్టానం మంచి అవకాశం ఇచ్చింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో యువకులకు చోటునిచ్చింది. కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి గ్రామానికి చెందిన యువజన నేత పుల్లబోయిన దుర్గేష్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. దుర్గేష్ ఎంపిక పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం పని చేస్తా దుర్గేష్ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని దుర్గేష్ ప్రకటించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలీయమైన శక్తిగా ఎదిగిందని, ఇందులో నియోజకవర్గానికి చెందిన అందరి పాత్ర ఉందన్నారు. తన వంతుగా తాను కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్ద కాలంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. తన ఏంపీకకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హనుమంతరావు, గాలి అనిల్ కుమార్, ఆవుల రాజిరెడ్డి, చిలుముల సుహాసిని రెడ్డి, చిలుముల శేషాసాయి రెడ్డి కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
## - రైతు మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**- రైతుల సౌకర్యార్థం బస్సుల సౌకర్యం**


**- ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**- బోయినిపల్లి మండల వ్యవసాయ అధికారి : ప్రణీత**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండలం,నర్మెట్ట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మార్చి 22, 2026న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, ఆయిల్ పామ్ రిఫైనరీ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు.
ఈ సందర్భంగా మార్చి 20, 21, 22 తేదీలలో మూడు రోజుల పాటు రైతు మహోత్సవం (కిసాన్ మేళా) నిర్వహించబడుతుంది. ఈ మహోత్సవంలో సుమారు 150 ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు, రైతులు, శాస్త్రవేత్తల మధ్య చర్చా గోష్ఠులు నిర్వహించనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆయిల్ పామ్ సాగు అవకాశాలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే రైతుల సౌకర్యార్థం బోయినిపల్లి మండలం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మార్చి 20న ఒక బస్సు, 21న ఒక బస్సు, 22న మూడు బస్సులు నడపనున్నారు. ఆసక్తి గల రైతులు తమ వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బోయినిపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
## ఘనంగా ఉగాది వేడుకలు



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహంకాళీ దేవలయం లో ఉగాది పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితులు వేదాంతం నరసింహ మూర్తి నేతృత్వంలో అర్చకులు పత్యేక పూజలు చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా దేవాలయ మంటపంలో పరాభవ నామసవత్సరం పంచాంగ పూజ నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నూతన పంచాంగాలను ఆవిష్కరించిన అనంతరం ప్రధాన అర్చకుడు పంచాంగం చదివి వినిపించి భక్తులకు నూతన పంచాంగాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మెన్ మెతుకు శ్రీనివాస్ రెడ్డి, శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, జనరల్ సెక్రటరీగా బొగ్గారపు రమేష్, కోశాధికారి ఏగిన భాస్కర్, జాయింట్ సెక్రటరీ మహేశ్వర మూర్తి, అడిషనల్ జాయింట్ సెక్రటరీ ఎలిషాల లింగం, ఉపాధ్యక్షులు గౌరీశెట్టి నరేందర్, పుల్లూరి లక్ష్మణ్, సలహాదారులు, సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు కృష్ణా యాదవ్, సునీల్ రెడ్డి, బాలరాజ్ పాల్గొన్నారు

## యాదాద్రి దేవస్థానం అర్చకుడిపై ఫిర్యాదు


बहुजना साहित्य अकादमी (B.S.A.)
BAHUJANA SAHITYA ACADEMY
NATIONAL COMMITTEE OF INDIA

నాచారం (ప్రశ్న న్యూస్)యాదగిరిగుట్ట దేవస్థానంలో పనిచేస్తున్న ప్రధాన అర్చకుడిపై వివాదం చెలరేగింది. శ్రీ వైష్ణవ సాంప్రదాయం, శాస్త్రాలకు విరుద్ధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు అందింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ దేవాదాయ ధర్మాదాయ శాఖకు ఫిర్యాదు చేశారు. యాదాద్రి దేవస్థానంలో ప్రార్థన అర్చకుడిగా పనిచేస్తున్న కాండూరి వెంకటాచార్యులు ఆలయ సాంప్రదాయాలు, శాస్త్రాలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం వెంకటాచార్యులు జాత శౌచంలో ఉన్నప్పటికీ వైష్ణవ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తూ స్వామివారి బ్రహ్మోత్సవాలు సహా ఆలయ కార్యక్రమాలలో పాల్గొన్నారని ఆరోపించారు. ఇది దైవద్రోహానికి, హిందూ ధర్మానికి విరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అర్చకుడు వెంకటాచార్యులపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని, రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్ద యుగంధర్, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ జేఏసీ నాయకుడు విష్ణు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ టేకి రాజశేఖర్ పాల్గొన్నారు.

# సేవలకు ఘన సత్కారం
# రాజన్నాలయానికి దక్కిన రాష్ట్ర స్థాయి గౌరవం

**- ఈ గౌరవంతో వేములవాడ రాజన్న క్షేత్రం మరింత ఖ్యాతి గడిస్తుంది - రాజన్నాలయ ఈఓ : రమాదేవి ప్రశంసలు**





వేములవాడ (ప్రశ్న న్యూస్ ) ఉగాది పురస్కారాల్లో వేములవాడ రాజన్న క్షేత్రానికి ఘన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేవకులు పురస్కారాలు అందుకోవడం విశేషంగా నిలిచింది. దేవస్థానం ప్రధాన అర్చకులు ఈశ్వరగారి సురేష్,నాదస్వర విద్వాంసుడు ఎన్.శ్రీనివాస్ తమ ప్రతిభ, సేవలకు గుర్తింపుగా ఉగాది పురస్కారం అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేయడం మరింత గౌరవంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలను వేములవాడ ఆలయ కార్యనిర్వాహక అధికారి రమాదేవి అభినందిస్తూ, వారి కృషి వేములవాడ దేవస్థానానికి మరింత ఖ్యాతిని తీసుకువస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా భక్తులు,అధికారులు సంతోషం వ్యక్తం చేస్తూ, దేవస్థానం ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతోందని అభిప్రాయపడ్డారు.

# ఇంక ఎన్ని దశాబ్దాలు కావాలి ఎమ్మెల్యే సాబ్

**-టిపిసిసి సెక్రెటరీ ఎం ఆర్ శ్రీనివాసరావు**

**- లాలాపేట రహదారి విస్తరణకు 12 ఏళ్ల దాటిన ఇంకా అదే దుస్థితి**

**- కిలోమీటర్ రోడ్డు కోసం 12 ఏళ్లు ఎందుకు.?**

**- నిర్లక్ష్యం ఎవరిది అధికారులదా.? లేక ప్రజా ప్రతినిధులదా.?**

**- నాసిరకం పనులపై చర్యలు ఎప్పుడు.?**

**- లాలాపేట ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎక్కడ.?**

**- నిద్రపోతున్న ప్రతిపక్ష నేతలు, ఉండి వృథానేగా**







తార్నాక (ప్రశ్న న్యూస్) గెలిచామా, సంపాదించుకున్నామా, హాయిగా ఉన్నామా, ఇప్పుడు ప్రజాప్రతినిధుల పరిస్థితి ఇలాగే ఉంది. ఎన్నికల ముందు వారు చెప్పే కల్లిబొల్లి కబుర్లకు ప్రజలు ఆశపడి ఓటును బీరు, బిర్యానీకి అమ్ముకోవడంతో అభివృద్ధి ఆమెడ దూరానికి పోతుంది. ప్రతిపక్ష నేతలకు అడిగే దమ్ము ధైర్యం లేదు, మరి వాళ్ళు ప్రతిపక్ష నేతలు ఎలా అయ్యారో వాళ్ళ విజ్ఞతకే తెలియాలి. సాక్షాత్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని సమస్యలే ఆయన ఏ రోజు పట్టించుకున్న దాఖలాలు లేవు. సొంత కార్యకర్తలలే పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి ఇక ప్రజల సమస్యలు పట్టించుకుంటారు అనుకోవడం కలనే.. అత్యాశనేగా..సికింద్రాబాద్ నియోజకవర్గంలోని లాలాపేటలో రహదారి విస్తరణ పనులు ప్రజలను విసిగిస్తున్నాయి. దాదాపు 12 ఏళ్ల నుండి స్థానికులు వాహనాదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్న స్థానిక ఎమ్మెల్యే పద్మారావుకు కనీస కనికరం లేకపాయే అని టిపిసిసి కార్యదర్శి ఎం ఆర్ శ్రీనివాసరావు మండిపడ్డారు. కిలోమీటర్ కూడా లేని ఈ రోడ్డు విస్తరణకు దాదాపు 12 సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాలేదు అంటే అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని టీపీసీసీ సెక్రటరీ ఎం.ఆర్. శ్రీనివాసరావు తీవ్ర ఆరోపణలు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అభివృద్ధి పనులపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని ఎం.ఆర్ మండిపడ్డారు. రహదారిని కేవలం నామమాత్రంగా తవ్వి, కంకర వేసి వదిలేయడం ద్వారా ప్రజలకు మరిన్ని ఇబ్బందులు కలుగుతున్నాయని అది కూడా గమనించలేని దుస్థితి ఏర్పడిందని ప్రజలను మానసిక ఆవేదనకు గురిచేస్తున్నారని విమర్శించారు. బీ టీ రోడ్డు వేయాల్సిన చోట సంవత్సరాలుగా పనులు నిలిచిపోయాయని, వర్షాకాలంలో బురద, ఎండాకాలంలో దుమ్ముతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇంజనీరింగ్ ప్రాజెక్టు అధికారులపై కూడా ఎం.ఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేసి ప్రజల డబ్బును వృథా చేస్తున్నాడని డ్రైనేజ్, తాగునీరు పైపుల పేరుతో ప్రజల నుండి అధికారులు కాంట్రాక్టర్ వసూలు చేశారని మండిపడ్డారు. పూర్తి నాసిరకంగా చేస్తున్న పనుల నాణ్యతపై



అధికారుల ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు మేల్కొని కాలక్షేపం ఆపి పూర్తి స్థాయిలో నిర్మాణాలను తొలగించి రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎం.ఆర్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## తెలుగు సంప్రదాయాలకు ప్రతీక ఉగాది పండుగ

**-ప్రతి ఇంటా ఐశ్వర్యం - ఆనందం వెల్లివిరియాలి**

**- ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు**

**- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,**
**మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ : కోరెపు నరేష్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) ఉగాది పండుగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండల నాయకులు , మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కోరెపు నరేష్ మండల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి శుభాలను, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిలో ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అదేవిధంగా, మన పూర్వీకుల సంప్రదాయాలను కాపాడుకుంటూ ఉగాది పండుగను అందరూ సంతోషంగా, ఐక్యంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలు

**- ఉప్పల్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ సేవలు మరువలేనివి మేడ్చల్ డి సి మెంబెర్ సంగిశెట్టి రవీందర్ సాగర్**

**- పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను బీజేపీ పార్టీ గుర్తిస్తుంది**



నాచారం(ప్రశ్న న్యూస్) ఉగాది పర్వదినం రోజున ఉదయించిన బీజేపీ నేత ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ జిల్లా డిసి మెంబర్ సంగిశెట్టి రవీంద్రసాగర్ శాలువా కప్పి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర నాయకులుగా సేవలు అందిస్తూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉప్పల్ బీజేపీ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందించారని, ఆయన సేవలో మరువ లేనివి అని, ఉప్పల్ నియోజకవర్గం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ఆయన హయాంలో ఎంతో మందికి ఉపాధి కల్పించడం జరిగిందని, బిజెపి కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధం ఎల్లప్పుడూ కొనసాగిస్తూ రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ నాయకులతో మాట్లాడుతూ రాష్ట్రానికి రావలసిన పథకాలు, నిధులు వచ్చేలా ఆయన చర్యలు తీసుకుంటూనే ప్రజలకు మంచి సేవ దృక్పథంతో ప్రజల మన్ననాలను పొందుతూ ముందుకు సాగుతున్న నేత మన మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఒక్కరే అని ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్ విస్తరించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో అందులోనూ బిజెపి మేయర్ పీఠం దక్కించుకునేలా ఆయన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ పార్టీకి ఉంటాయని ఆయనను నమ్ముకున్న కార్యకర్తలకు ఆయన సహకారం ఎప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సబితా యాదవ్ డివిజన్ సెక్రెటరీ వేముల రమేష్ సాగర్ బూత్ ప్రెసిడెంట్, లింగం గౌడ్, శ్రీనివాస్ సాగర్, శ్రీనివాస్ కురుమ ఆనంద్, మధు బిజెపి మల్లాపూర్, శక్తి సాయి నగర్ డివిజన్ నాయకులు, మహిళ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ పర్మిషన్, కమర్షియల్ నిర్మాణాలు

## - అధికారుల సెటిల్మెంట్లు

- హై టెన్షన్ రోడ్డుపై అక్రమ నిర్మాణాల దందా
- నోటీసుల నాటకం, చర్యలు ఎక్కడ.?
- కూల్చివేతలు చేయక అధికారుల మౌనం ఎందుకు.?
- ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేస్తుంది అధికారులే
- ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కుతుంది అధికారులే




**కాప్రా(ప్రశ్న న్యూస్)** ఉప్పల్ జోన్ పరిధిలోని కాప్రా సర్కిల్‌లో హై టెన్షన్ రోడ్డు లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ఈ అక్రమ నిర్మాణాలపై కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చామనే పేరుతో కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అక్రమాలు చూస్తే ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులే ఇంత అవినీతి అక్రమాలకు బరితెగిస్తే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు కూడా చూసి చూడనట్లు మౌనంగా ఉండడం వెనక వాళ్లకు కూడా వాటాలు అందుతున్నాయా.? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

### నోటీసులే.. చర్యలు లేవు

కాప్రా సర్కిల్ పరిధిలో భారీగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వచ్చిన ప్రతిసారీ అధికారులు "నోటీసులు జారీ చేశాం, త్వరలో చర్యలు తీసుకుంటాం" అంటూ చెప్పడమే గానీ వాస్తవానికి మాత్రం ఎలాంటి చర్యలు కనిపించడం లేదని దీనితో అధికారులు అక్రమ నిర్మాణదారులతో అంతర్గత ఆర్థిక ఒప్పందాలు చేసుకున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు




స్థానికులు. ఇదే పరిస్థితి నెలల తరబడి కొనసాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కాప్రా టౌన్ ప్లానింగ్‌లో అవినీతి.?

కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాప్రా సర్కిల్ హై టెన్షన్ రోడ్లో పక్కింటి నెంబర్ 1-19--72/ 49 రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేయడంతో పాటు అక్రమాంతస్తులు స్టిల్ట్ లో పార్కింగ్ ఏర్పాటు చేయకుండా షట్టర్లు వేయడం పై స్థానికులు మండిపడుతున్నారు అదేవిధంగా హై టెన్షన్ రోడ్ లోని ఈశ్వరిపురి కాలనీలో పక్కా ఇంటి నెంబర్ 165ఎ, 165బి లో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణం చేయడం జరుగుతుందని అదే విధంగా అక్రమ అంతస్తులు స్టిల్ట్ లో షెటర్లు వేస్తున్నారని స్టిల్ట్ లో షెటర్లు వేసి వ్యాపారం చేస్తే పార్కింగ్ ఎక్కడ చేయాలో ఎసిపి డిప్యూటీ కమిషనర్ తెలపాలి. లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసిన అధికారులు అక్రమ నిర్మాణదారుల వద్ద లంచాలు తీసుకొని చర్యలు తీసుకుంట లేరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులతో అధికారుల అంతర్గత ఆర్థిక ఒప్పందాలున్నాయా..? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు పత్రికలో కథనాలు వచ్చిన చలనం లేకుండా ఉండడం వెనుక లక్షలలో వసూళ్లు చేస్తున్నారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇచ్చి మళ్లీ వెనక్కి తగ్గడం వెనుక డీల్ ఉందా.? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### పత్రికా కథనాలు వచ్చిన అధికారుల నిర్లక్ష్యం..

కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వెలువడినా టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, డిప్యూటీ కమిషనర్ శ్రీహరి స్థాయిలో ఎలాంటి స్పందన కనిపించకపోవడం ఆశ్చర్యకరం కలిగిస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యమా.? లేక అక్రమాలకు మౌన సహకారమా.? అనే అనుమానాలు స్థానికులలో మరింత బలపడుతున్నాయి. హై టెన్షన్ రోడ్డు లో చాలా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని డిప్యూటీ కమిషనర్ ఏసిపి సెక్షన్ ఆఫీసర్ల స్పందించకపోవడం




వెనక ముందుగానే అక్రమ నిర్మాణదారులు వాళ్లతో సెటిల్మెంట్ చేసుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు తీసుకుంట లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు ఎక్కడ.?

ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, కమిషనర్ వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి ఈ వ్యవహారం వెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఉప్పల్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వలనప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయం రెండింటినీ నష్టం కలిగిస్తున్న ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. అక్రమ నిర్మాణాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులకు లక్షలలో అక్రమ ఆదాయం వస్తుంది కానీప్రభుత్వానికి నష్టం, ప్రజలకు ముప్పు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కచ్చితంగా బాధ్యతారాహిత్యమే అని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుండగా, హై టెన్షన్ లైన్ల సమీపంలో మెయిన్ రోడ్డు పై అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. అయిన కూడా కమిషనర్, జోనల్ కమిషనర్, ఉన్నత అధికారుల వైఖరిలో మార్పు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కుమార్ రెడ్డి స్పందించి సర్కిల్లో జరుగుతున్నఅక్రమ నిర్మాణాలపై తక్షణ కూల్చివేత చర్యలు తీసుకుని ప్రోత్సహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని లేకపోతే ఈ "నోటీసుల నాటకం"పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అంబర్ పేట సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు

- బల్దియా ఆదాయానికి గండి, చైన్ మెన్, అధికారుల జేబుల్లోకి ఆదాయం
- నోటీసులకే పరిమితమైన అధికారులు చర్యలు మాత్రం శూన్యం
- ఒక్క నోటీసుతో కాలక్షేపం వెనక కారణం ఏమిటి.?
- బురుజు గల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా యదేచ్చగా అక్రమ నిర్మాణం



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవు అని చెప్పే అధికారులు కేవలం నోటీసులకే పరిమితమై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక లంచాలే కారణమా.? అంబర్ పేట సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. బురుజు గల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక లంచాలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా చైన్ మెన్, న్యాక్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు లంచాలు ఇస్తే చాలు మీరు యదేచ్చగా నిర్మాణం చేసుకోవచ్చు. నిబంధనలు పాటించకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసినా పట్టించుకోరు. స్థానికులు ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు కళ్ల ముందు కనిపిస్తున్నా, నోటీసులు ఇవ్వకుండా, పనులు




ఆపకుండా డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం వెనక భారీగా ముడుపులు అందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### లంచాలు ఇస్తే అక్రమమైన సక్రమమే..

డబ్బు ఇస్తే చాలు నిర్మాణాలకు నిబంధనలు అక్కర్లేదు అన్నట్లు మారింది పరిస్థితి. అక్రమ నిర్మాణాల వెనుక మున్సిపల్ అధికారులకు భారీగా లంచాలు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, న్యాక్ ఇంజనీర్లు, చైన్ మెన్ లు కలిసి అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారు. అందుకోసమే బురుజు గల్లీలో పక్కింటి నెంబర్ 2-2-474 పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుంటే అధికారులు లంచాలు తీసుకుని జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోటి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారని పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు స్పందించడం లేదంటే ఎంత భారీ స్థాయిలో లంచాలు అందాయో అర్థం చేసుకోవచ్చు అని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సీఈ కాలనీలోని పక్కింటి నెంబర్ 2-2-647/235/2ఎ అక్రమ నిర్మాణం అదే కాలనీలో పక్కింటి నెంబర్ 2-2- 647/234 అక్రమ అంతస్తులు యదేచ్చగా నిర్మాణాలు జరుగుతుంటే కేవలం నోటీసులు ఇచ్చారు చర్యలు తీసుకుంటాం అంటూ కాలం గడుపుతున్నారు తప్ప చర్యలు తీసుకోకపోవడం పై చైన్ మెన్ అశ్విన్ చక్రం తిప్పుతున్నారని కమిషనర్ అక్రమ నిర్మాణాలపై సీరియస్ గా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

### అక్రమ నిర్మాణాలకు డిప్యూటీ కమిషనర్ అండదండలా.?

అంబర్ పేట సర్కిల్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అసలు పట్టించుకోవడంలేదని ఆయన నిర్లక్ష్యంతోనే టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏసిపి, సెక్షన్ ఆఫీసర్ ఎవరు ఫోన్ ఎత్తరని కేవలం వాళ్లకు డబ్బులు ఇచ్చే వాళ్లయితేనే ఫోన్లు ఎత్తుతారా అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఇందులో చైన్ మెన్ అశ్విన్ కీలక పాత్ర పోషిస్తున్నాడని ఆయన అవినీతికి హద్దు అదుపు లేకుండా పోయిందని వివరణ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్




ఎత్తడం లేదని సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ జోనల్ కమిషనర్లు కూడా ఫోన్ ఎత్తుతారు అంతకంటే పెద్ద అధికారిలాగా చైన్ మెన్ అశ్విన్ వ్యవహారం ఉందని ఎందుకు కారణం ఆయన అధికారులకు భారీగా అక్రమ నిర్మాణాల వద్ద నుండి లంచాలు వసూలు చేసి ఇవ్వడం వల్ల అధికారులు కూడా ఆయనపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇలా అధికారులు, సిబ్బంది ఎలాంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణం పై కూడా చర్యలు తీసుకోవడానికి కాకమ్మ కబుర్లు చెబుతున్నారని అంటే వీళ్లకు జిహెచ్ఎంసి నిబంధనలు లెక్కలేదు, ఉన్నత అధికారులు అంటే భయం లేదు. ఇలా ఉంది జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్, కమిషనర్ పాలన ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ భవనం పై చర్యలు తీసుకుంటారో లేక లంచాలలో వాటా అడుగుతారో వేచి చూడాలి.

---

వికలాంగులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి

# కనికరం లేదా.?

**- కొప్పుల జగదీష్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులుకు తెలంగాణలోని వికలాంగుల పై కనీస కనికరం లేదని వాళ్లకు సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందాలని కొప్పుల జగదీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేశారు కానీ వికలాంగులకు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాజకీయాల్లో వికలాంగుల సంక్షేమంపై మరోసారి వేడి చర్చ మొదలైంది. కొప్పుల జగదీష్, రాష్ట్రంలోని వికలాంగుల పరిస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం వికలాంగుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఉచిత బస్ పాస్ వంటి మౌలిక సౌకర్యాలను కూడా అందించడంలో ముఖ్యమంత్రికి ఎందుకు మనసు రావడం లేదన్నారు. లక్షల కోట్ల బడ్జెట్ చూపించడం కాదు, పేదలకు ఎంత అందుతోంది అన్నదే అసలు పాలనకు నిదర్శనం అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు అమలు చేస్తున్న అనేక పథకాలను ఉదాహరణగా చూపిస్తూ తెలంగాణ ప్రభుత్వం కూడా అక్కడి పాలనను చూసి చాలా నేర్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులపై కనీస కనికరం లేకుండా వ్యవహరించడం బాధాకరమని అన్ని రాజకీయ పార్టీలు కలసి ఈ విషయంలో బాధ్యత వహించాలని అన్నారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వాళ్లకు పెద్ద మనసు ఉండదా.? అని ప్రశ్నించిన కొప్పుల జగదీష్, వికలాంగులను చిన్నచూపు చూడకుండా వారిని మనుషులుగా గౌరవించాలని పిలుపునిచ్చారు. వికలాంగులకు చేయబడే సహాయం పుణ్యంగా భావించాలే కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ అది భారంగా చూడకూడదని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ భారీగా ఉన్నప్పటికీ పేదల జీవన స్థితిలో మార్పు కనిపించడం లేదని ఆయన విమర్శించారు. లక్షల కోట్ల బడ్జెట్ తో "పేదలు బాగుపడుతున్నారా, లేక పాలకులే బాగుపడుతున్నారా.? అని ప్రజలే నిర్ణయించాలంటూ ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఏపీలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం

**- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1,215 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులతో అమరావతిలో సమీక్ష నిర్వహించారు. కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 16 మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 2,043 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 630 హెక్టార్లలో మొక్కజొన్న, 384 హెక్టార్లలో వరి, 200 హెక్టార్లలో మినుము ఉన్నాయని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లో 267 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి, ఆరెంజ్ వంటి పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 307 మంది ఉద్యాన రైతులు నష్టపోయారని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రాథమిక అంచనాలపై స్పందించిన ముఖ్యమంత్రి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## గ్యాస్ బుకింగ్ పేరుతో కొత్త మోసం


**- వాట్సాప్‌లో వచ్చే ఫైల్స్‌తో జాగ్రత్త!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎల్పీజీ గ్యాస్ బుకింగ్స్ పేరుతో కొత్త తరహా సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. 'గ్యాస్ బిల్ అప్డేట్ ఏపీకె' వంటి హానికరమైన ఫైల్స్‌ను వాట్సాప్ ద్వారా పంపి వినియోగదారులను మోసం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి అనుమానాస్పద ఫైల్స్‌ను, అప్లికేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ లేదా ఇన్‌స్టాల్ చేయవద్దని అధికారులు తెలిపారు. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు వినియోగదారుల వ్యక్తిగత డేటా, బ్యాంకు ఖాతాల వివరాలను దొంగిలించే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. గ్యాస్ బుకింగ్స్ కోసం కేవలం అధికారిక ప్లాట్‌ఫామ్స్‌ను మాత్రమే ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు అవసరమైన ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. గ్యాస్ కొరతపై వదంతులు నమ్మవద్దని, ఆందోళనతో సిలిండర్లు బుక్ చేసుకోవద్దని కోరింది. గ్యాస్ సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి బుకింగ్ చేసుకునేలా విరామాన్ని సవరించారు. గ్యాస్‌పై ఒత్తిడి తగ్గించేందుకు కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, కొత్త పీఎన్ జీ కనెక్షన్లను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు సూచించింది. మొత్తం మీద గ్యాస్ సరఫరాకు ఢోకా లేదని భరోసా ఇస్తూనే, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం ప్రజలను కోరుతోంది.

## యుద్ధాన్ని ముగించేది ట్రంప్‌దే అంతిమ నిర్ణయం

**- అమెరికా రక్షణ మంత్రి**



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. అయితే ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే విషయం చెప్పలేమని అన్నారు. యుద్ధం ముగింపుపై కచ్చితమైన కాలపరిమితిని చెప్పేందుకు ఆయన నిరాకరించారు. యుద్ధం విషయంలో అంతిమ నిర్ణయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌దే అన్నారు. యుద్ధం ముగింపునకు తాము కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించుకోలేదని తెలిపారు. సౌదీ అరేబియాలోని అతిపెద్ద గ్యాస్ కేంద్రంపై ఇరాన్ దాడికి పాల్పడడంతో ఆగ్రహించిన అమెరికా తీవ్ర పరిణమాలు తప్పవని హెచ్చరించింది. ఇరాన్‌పై ఈ రోజు భారీ స్థయిలో దాడులకు పాల్పడుతామని, గల్ఫ్ యుద్ధాన్ని తమదైన స్టయిల్లో ముగిస్తామని పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. చనిపోయిన వారిని గౌరవిస్తామని, అనుకున్న పనిని పూర్తి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యుద్ధాన్ని ముగిస్తామని అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధానికి దిగిన మొదటి రోజు నుంచి తమ లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదని ఆయన వెల్లడించారు. ఇరాన్ రక్షణ, క్షిపణి తయారీ కేంద్రాలను నాశనం చేశామని, కాబట్టి ఆ దేశం కొత్తగా బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసుకోలేదని అన్నారు. అంతేకాదు ఇరాన్‌కు చెందిన 11 జలాంతర్గాములను ముంచివేసినట్లు తెలిపారు. ఏయే లక్ష్యాలతో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభించామో అవన్నీ సాధించి, తాము అనుకున్న మిషన్‌ను పూర్తి చేస్తామని పీట్ హెగ్సెత్ అన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588